PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 48 | విజయవాడ, గురువారం 18 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 18 September 2025 | Rs



మంధాన సెంచరీ

• దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన
• రెండో వన్డేలో ఆస్ట్రేలియా మహిళలపై టీమిండియా గెలుపు

8

నిజాం తరహాలోనే మోడీ

• బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు నైతిక హక్కు లేదు • జనగాంలో భారీ ర్యాలీ, బహిరంగ సభలో ఎంఎ బేబి

• హిందీ, సంస్కృతాన్ని రుద్దే ప్రయత్నం : బివి రాఘవులు • యువతరాన్ని తప్పుదోవ పట్టించే కుట్రలు : బృందాకరత్

• తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్సవం సందర్భంగా జనగామలో నిర్వహించిన ర్యాలీ.. అనంతరం జరిగిన సభలో పూల బతుకమ్మలను ఎంఎ బేబీకి అందజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాడు నిజాం తరహాలోనే నేడు ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జనగామలో ఎంఎ బేబి, సంగారెడ్డి జిల్లాలో పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, నల్లగొండ, సూర్యాపేటలో సిపిఎం జాతీయ నాయకులు, పార్లమెంటు మాజీ సభ్యురాలు బృందాకరత్ పాల్గొన్నారు. జనగామ బహిరంగ సభలో బేబి మాట్లాడుతూ.. భూస్వాములకు, బడా పెత్తందార్లకు నాడు నిజాం అండగా నిలిచినట్టే.. నేడు ప్రధాని మోడీ అదాని, అంబానిలకు అండగా ఉన్నారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి నాయకత్వం మతం రంగు పులుముతుందన్నారు. తెలంగాణలో 1946 నుంచి 1951 వరకు ఐదేండ్లపాటు భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం చేశారని అన్నారు. ప్రపంచ చరిత్రలోనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యేకత ఉందన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన ఈ పోరాటంతో మూడు వేల గ్రామాలను విముక్తి చేయడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములను ప్రజలకు పంపిణీ చేశారని తెలిపారు. ఎలాంటి చట్టాలు లేని కాలంలోనే కమ్యూనిస్టుల నాయకత్వంలో ఇంత పెద్ద ఎత్తున భూమిని పంచడం చారిత్రాత్మకమన్నారు. ఈ పోరాట స్ఫూర్తితోనే కేరళలో 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం భూ సంస్కరణలను అమలు చేసిందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పురుషులతో సమానంగా మహిళలు పోరాటం చేయడం విశేషమన్నారు. మల్లు స్వరాజ్యం అసమాన సాహసం మహిళలను ఈ పోరాటంలో మమేకం చేసిందన్నారు. ఢిల్లీలో ఈ మధ్య జైపాల్‌సింగ్ భవనానికి శంకుస్థాపన చేశామని, జైపాల్ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలకు ఆయుధ శిక్షణనిచ్చారని తెలిపారు. ఈరోజు హైదరాబాద్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధించి బిజెపి ఒక కార్యక్రమం చేస్తుందని, ఈ పోరాటంలో వారి పాత్ర ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంలో హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసే క్రమంలో ప్రధాని నెహ్రూ నాయకత్వంలో సర్దార్ వల్లభాయ్ పటేల్... నిజాం, భూస్వాములను కాపాడుతూ పోరాటం చేసిన నాయకులు, కార్యకర్తలపై తీవ్రమైన మారణకాండను కొనసాగించారన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారతదేశంపై పన్నులు విధిస్తున్నా ప్రధాని మోడీ పెదవి విప్పడం లేదని విమర్శించారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ రెచ్చిపోతుందన్నారు. పాలస్తీనాకు మనం మద్దతునివ్వాల్సి ఉందన్నారు.

అదాని, అంబానిలకు మోడీ త్రయం అండ

అస్సాం అటవీప్రాంతంలోని గిరిజనులను బయటకు పంపి విలువైన ఖనిజాలున్న ఆ అడవులను అదాని, అంబానిలకు కట్టబెట్టడానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. పార్లమెంటులో ఒకవైపు బీహార్‌లో ఎన్నికల సంఘం ఎస్‌ఐఆర్‌తో తొలగించిన ఓట్లపై చర్చ జరుగుతుండగానే మోడీ ప్రభుత్వం మినరల్స్ అండ్ మైనింగ్ చట్టంలో పలు సవరణలు చేస్తూ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లను ఎస్‌ఐఆర్ పేరిట తొలగించడం, సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిన విషయాలను ప్రజల్లోకి మిగతా 7లో



జిసిసి సమ్మిట్‌లో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ప్రైవేటీకరణే మా విధానం

2021 బడ్జెట్‌లో మొట్టమొదట అనుమతించాం

ప్రభుత్వ రంగం ప్రభుత్వం చేతిలో ఉండకూడదు

• జిసిసి సమ్మిట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి
• పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంటాం : చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశంలో మొట్టమొదటసారిగా కొన్ని రంగాలను ప్రైవేటీకరణ చేసేందుకు 2021 బడ్జెట్‌లో అనుమతి ఇచ్చాం. తద్వారా మా విధానం ప్రైవేటీకరణ అని చెప్పగలిగాం' అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యాన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జిసిసి) సమ్మిట్ బుధవారం విశాఖలోని రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిర్మలా సీతారామన్ హాజరై మాట్లాడారు. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ప్రభుత్వం చేతుల్లో ఉండకూడదని బిజెపి ప్రభుత్వం విధానం తీసుకుందని తెలిపారు. నేషనల్ సెక్యూరిటీ (జాతీయ భద్రతా) రీత్యా స్ట్రాటజిక్ సెక్టార్ మాత్రం ప్రభుత్వ గుప్పెట్లో ఉంచుకోవాలని అనుకున్నామన్నారు. దేశంలో మొట్ట మొదటసారిగా 1991లో పివి.నరసింహారావు ఆర్థిక సంస్కరణలను ప్రారంభించగా 2014లో ఆ సంస్కరణలను బిజెపి ప్రభుత్వం వేగవంతం చేసిందని చెప్పారు. అమరావతి కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ, విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో వందల ఎకరాల్లో గూగుల్ కంపెనీల రాకతో పారిశ్రామిక ప్రగతికి దోహదపడతాయని మిగతా 7లో

నెల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం

• కారును ఢీకొట్టిన టిప్పర్
• ఏడుగురు దుర్మరణం



కారులో నుజ్జునుజ్జయిన మృతదేహాలను వెలికితీస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- సంగం (నెల్లూరు)

నెల్లూరు జిల్లా సంగం మండలంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. వారిలో ఇద్దరు భార్యాభర్తలు, వారి బంధువులు నలుగురు ఉన్నారు. వీరు ఆరుగురూ దళితులు. ఈ ప్రమాదంపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తమ సమీప బంధువులను పరామర్శించడానికి నెల్లూరు నగరం ముత్తుకూరు గేట్ సమీపంలోని గుర్రాలమడుగు సంగం ప్రాంతానికి చెందిన తాళ్లూరు శ్రీనివాసులు (38) తన భార్య, బంధువులతో కలిసి నెల్లూరు నుంచి కారులో వెళుతున్నారు. సంగం దాటిన తర్వాత పెరమన వద్ద ఆత్మకూరు ప్రాంతంలోని ఇసుక రీచ్ నుంచి టిప్పర్ అతి వేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి వీరి కారును ఢీకొట్టి పైనుంచి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తాళూర్లు శ్రీనివాసులు (38), ఆయన భార్య రాధ (36), వారి బంధువులైన నెల్లూరులోని రామ్‌జీ నగర్‌కు చెందిన శేషం సారమ్మ (40), ఇందుకూరుపేట గ్రామానికి చెందిన చల్లగుండ్ల లక్ష్మి (40), చల్లగుండ్ల శ్రీనివాసులు (40), శేషం వెంగయ్య (30), కారు డ్రైవర్ కత్తి బ్రహ్మయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందారు. టిప్పర్లో ఇరుక్కుపోయిన కారును సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి సంగం పోలీసులు జెసిబి, క్రేన్ల సహాయంతో బయటకు తీశారు. మృతదేహాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ టిప్పరు మిగతా 7లో



నేటి నుంచి అసెంబ్లీ

హాజరుకానున్న వైసిపి ఎమ్మెల్యేలు?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రశ్నోత్తరాలతో ప్రారంభం కానున్నాయి. వైసిపి ఎంఎల్‌ఏలు కూడా ఈ సారి శాసనసభకు హాజరుకావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. తొలిరోజు సభకు హాజరై వాకౌట్ చేయాలని వారు భావిస్తున్నట్లు తెలిసింది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరవుతారా, లేదా అన్న విషయమై స్పష్టత రాలేదు. అసెంబ్లీ జరిగే మిగిలిన రోజుల్లో వారు ఎటువంటి వ్యూహాన్ని అనుసరించనున్నారన్న అంశమూ చర్చనీయాంశంగా మారింది. మరోవైపుఅభివృద్ధిని చెప్పుకునేందుకు, గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపేందుకు, ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కొనేందుకు అధికార కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి సిద్ధమవుతున్నాయి. సూపర్ సిక్స్‌లో నెరవేర్చిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డిఎస్సి వంటి అంశాలను ప్రస్తావించే అవకాశం ఉంది.వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, రైతుల ఎదుర్కొంటున్న యూరియా ఇబ్బందులు, ఉల్లి, టమోట పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం అంశాలను వైసిపి మండలిలో లేవనెత్తే అవకాశం ఉంది. అదేవిధంగా కరేడు భూ సేకరణ అంశాన్ని కూడా వైసిపిప్రస్తావించనుంది. రాజధాని అమరావతిలో రెండో దశ భూ సమీకరణతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే భూసమీకరణ వంటి అంశాలను ప్రస్తావించనుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ సంక్షేమాలతో పాటు వికలాంగ పింఛన్ల కోతలపై లేవనెత్తనుంది. ఈ సమావేశాల్లో ఐదు బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎపి వ్యవసాయభూమి(వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు)-2006 చట్టం(నాన్ అగ్రికల్చర్ అసెస్‌మెంట్ యాక్ట్-నాలా) రద్దుకు బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అదేవిధంగా సిఆర్‌డిఎ మినహా స్థానిక సంస్థల పరిధిలో ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి అనధికారికంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన డ్రాఫ్ట్ ఆర్డినెన్స్ గానీ బిల్లును గానీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.ఈ నెల 22 నుంచి దేవి శరన్నవ రాత్రులు, 24 నుంచి తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ రెండు చోట్లతో పాటు అసెంబ్లీకి భద్రతా కల్పించేందుకు పోలీస్ సిబ్బంది కొరత ఉంది.దీంతో అసెంబ్లీ సమావేశాలు మూడు నుంచి ఐదు రోజుల వరకే పరిమితమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాలపై చర్చించాలనే అంశాలు బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బిఎసి)లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. సమావేశాల నిర్వహణపై శాసనమండలి ఛైర్మన్ కె మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం అసెంబ్లీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బిఎసి తరువాత మధ్యాహ్నం 3 గంటలకు మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఇదే సమయంలో వైసిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలోని తన నివాసంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో సమకాలీన రాజకీయ అంశాలు, ప్రజాసమస్యలు తదితర అంశాలపై చర్చిస్తారని ఆ పార్టీ గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. టిడిపి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళలర్పించి అసెంబ్లీకి రానున్నారు. పసుపు రంగు దుస్తులు, సైకిల్ గుర్తు కలిగిన కండువాలు ధరించి అక్కడికి ఉదయం 8గంటలకు చేరుకోవాలని ఆ పార్టీ ఆదేశించింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై 21న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలు పిపిపి పేరుతో ప్రైవేటుపరం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10:30 గంటలకు విజయవాడలోని బాలోత్సవ భవనంలో జరిగే ఈ సమావేశానికి వామపక్షాలు, ప్రజా సంఘాల నేతలు, ప్రముఖులు హాజరవుతారన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లడం గర్హనీయమన్నారు. వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని, తద్వారా అభివృద్ధికి, పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు, మహిళలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని పున:పరిశీలించాలని కోరారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గీతం మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)



విశాఖపట్నం జిల్లా పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గీతం మెడికల్ కళాశాల విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ బాలకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... పంజాబ్ రాష్ట్రం జలంధర్‌కు చెందిన విస్మాద్‌సింగ్ (20) గీతంలోని వసతి భవనంలో ఉంటూ మెడిసిన్ మొదటి ఏడాది చదువు తున్నారు. బుధవారం వసతి భవనం ఆరో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకునేందుకు సిసి టివి పుటేజీలను పరిశీలిస్తున్నట్లు సిఐ తెలిపారు. విద్యార్థి కుటుంబానికి కళాశాల యాజమాన్యం సమాచారం అందించింది. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

గతేడాదిలో 146 మంది పర్యావరణవేత్తల హత్య

గ్లోబల్ విట్నెస్ నివేదిక

బొగోటా : గత సంవత్సర కాలంలో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న 146 మంది హత్యకు గురికావడమో,కనిపించకుండా పోవడమో జరిగిందని గ్లోబల్ విట్నెస్ అనే ఎన్‌జీఓ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ బుధవారం ఒక నివేదిక విడుదల చేసింది. ఇలా అదృశ్యమైన వారిలో మూడోవంతు మంది కొలంబియాలోనే ఉన్నారని సంస్థ పేర్కొంది. పర్యావరణవేత్తల హత్యలు, అదృశ్యానికి సంబంధించి చాలా దేశాల్లో వివరాలు తక్కువగా నమోదవుతున్నాయని నివేదికలో ఆ సంస్థ తెలిపింది. 2024లో లాటిన్ అమెరికాలో అత్యధికమంది కార్యకర్తలు హత్య, అదృశ్యమైనట్లు గ్లోబల్ విట్నెస్ ప్రకటించింది. ప్రపంచంలోనే పర్యావరణ పరిరక్షకులకు అత్యంత ప్రాణాంతకమైన దేశంగా కొలంబియా ఉందని వివరించింది. 20 హత్యలు, అదృశ్య కేసులతో గ్వాటెమాల ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉంది. తర్వాత మెక్సికో(19), బ్రెజిల్ (12), పిలిప్పీన్స్ (8)లు ఉన్నాయి. ఆయా దేశాల్లో హత్యకు గురైన వారిలో ఎక్కువమంది రైతులు, జర్నలిస్టులు, న్యాయవాదులుఉన్నారు.

ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకు తగ్గిన ఎగుమతులు

• మూడు నెలలుగా నేల చూపులు • సెప్టెంబర్‌లో మరింత తీవ్రం..!

3

ఎపి ఇఆర్‌సికి పూర్తిస్థాయి ఛైర్మన్‌ను ఎందుకు నియమించలేదు?

• ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి పూర్తిస్థాయి ఛైర్మన్‌ను ఎందుకు నియమించలేదని హైకోర్టు ప్రశ్నించింది. లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ వంటి సంస్థలకు నియామకాలు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిర్దిష్ట గడువు లోపు ఇఆర్‌సి ఛైర్మన్ నియామకం చేయాలంది. లేకుంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని విచారణకు పిలుస్తామని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం హెచ్చరించింది. ఇఆర్‌సి ఛైర్మన్ పోస్టు గతేడాది అక్టోబరు నుంచి ఖాళీగా ఉందని, భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ దొంతి నరసింహారెడ్డి పిల్‌పై విచారణ ఈ నెల 24కు వాయిదా పడింది. సభ్యుడే ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా ఉన్నారని పిటిషనర్ వాదన. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఈ మేరకు ప్రభుత్వం తెలిపింది.

బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల కలర్ ఫొటో

• ఇసి కీలక నిర్ణయం
• బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి అమలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇవిఎం బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు అభ్యర్థుల కలర్ ఫొటోను ముద్రించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం) బ్యాలెట్ పేపర్ రూపకల్పన, ముద్రణ శైలి మార్గదర్శకాలను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. బ్యాలెట్ పేపర్‌ను ఓటర్లు స్పష్టంగా చదవగలిగేలా, చూడగలిగేలా చర్యలు తీసుకుంది. 1961 ఎన్నికల నిర్వహణ నియమాల్లోని రూల్ 49బి సూచనలను కమిషన్ సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఇవిఎంల్లో అభ్యర్థి పేరు, గుర్తుతో పాటు వారి కలర్ ఫొటోను ప్రదర్శించనున్నారు. ఈ నిర్ణయాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ఇసి అమలు చేయనుంది. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా గత ఆరు నెలల కాలంలో తీసుకొచ్చిన 28 మార్పుల్లో తాజా నిర్ణయం కూడా ఒకటని ఇసి వెల్లడించింది. అభ్యర్థుల పేర్లు, నోటా ఆప్షన్‌కు కూడా ఇదే నిర్ణయం వర్తిస్తుందని తెలిపింది. ఈ నిర్ణయంలో భాగంగా అభ్యర్థుల కలర్ ఫొటోలను బ్యాలెట్ పేపర్లపై ముద్రిస్తారు. అభ్యర్థి ఫొటో స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టింది. పేపర్‌పై అక్షరాల ఫాంట్ పరిమాణం, నాణ్యత సైతం పెంచనుంది. అభ్యర్థుల సీరియల్ నంబర్లు, పేర్లు, ఫాంట్ అన్నీ ఒకే పరిమాణంలో ఉంటాయి. తద్వారా అవి సులభంగా చదవగలిగేలా ఉండనున్నాయి. దాంతో పాటు ఇవిఎం బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్‌ఎం పేపర్‌పై ముద్రిస్తారు. ఇందుకోసం నిర్ణయించిన ఆర్‌జిబి పింక్ కలర్ పేపర్‌ను ఉపయోగిస్తారు. ఈ చొరవతో ఓటింగ్ ప్రక్రియ సజావుగా ఉంటుందని ఇసి పేర్కొంది. అదే సమయంలో పారదర్శకత, ఎన్నికలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని ఇసి చెబుతున్నది. కలర్ ఫొటోలు, పెద్ద ఫాంట్, క్వాలిటీ పేపర్ కారణంగా ఓటర్లు ఎలాంటి గందరగోళానికి గురవకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని ఇసి తెలిపింది. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు పాటు సీనియర్ సిటిజన్లకు ఇంకా ప్రయోజనం ఉంటుందని ఇసి భావిస్తోంది.

తిరుమల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సిఎం చంద్రబాబును ఆహ్వానిస్తూ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అడిషనల్ ఇఒ వెంకయ్య చౌదరి ఆహ్వానపత్రికను బుధవారం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని పండితులు ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు.

దసరా సందర్భంగా ఏర్పాట్లు : మంత్రి ఆనం

విజయవాడలో జరిగే దసరా శరన్నవరాత్రుల్లో ప్రతిఒక్కరూ దుర్గమ్మను దర్శించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. మూల నక్షత్రం రోజున, విజయదశమి నాడు ప్రతిఒక్కరికీ ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రవాణా ఏర్పాటు విషయంలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.

కొనసాగుతోన్న ద్రోణి

- 2 రోజులు వర్షాలు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న రెండు రోజులు రాయలసీమలో ఒకట్రెండు చోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఈ నెల 18న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

ఒంగోలులో 64 మిల్లీమీటర్ల వర్షపాతం

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయి. సాయంత్రం 5 గంటల వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో 64 మిల్లీమీటర్లు, కె ఉప్పలపాడులో 53.5, వేములపాడులో 47, చిలకపాడులో 45, విజయనగరం జిల్లా రాజాంలో 40.2, కాకినాడలో 39 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ పేర్కొన్నారు.

రైతుల ప్లాట్లలో అసైన్డ్ పదం తొలగింపు

- ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో ఎసైన్డ్ రైతులకు ఇస్తున్న రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్డ్ అనే పదాన్ని తొలగించారు. వారికిస్తున్న పట్టాల్లో ఇక నుంచి ఈ పదం లేకుండా ఉండాలని నిర్ణయించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. అసైన్డ్ అనే పదం ఉండటంతో అవి అమ్ముడుపోవడం లేదని, రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో అసైన్డ్ భూములు ఎక్కువగా వారి చేతుల్లో లేవు. అసైన్డ్ భూములు ప్రభుత్వం తీసుకుంటుందని ప్రచారం జరగడంతో 2018 నాటికే ఎక్కువ మంది అమ్మేసుకున్నారు. అలా కొనుగోలు చేసుకున్న రైతులకు వాస్తవ లబ్ధిదారులు కేటాయించేశారు. ఇప్పుడు అటువంటి వాటిల్లోనూ ఆ పదం తొలగించనున్నారు. మరికొన్ని కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉంది.

ఆర్‌టిసి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించండి

- కార్మిక పరిషత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగుల ఉద్యోగోన్నతుల సమస్యను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఎపి పిటిడి కార్మిక పరిషత్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ట్రాన్స్‌పోర్టు రోడ్స్ అండ్ భవనాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబును కార్మిక పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి శేషగిరిరావు, వై శ్రీనివాసరావు కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎపిఇఆర్‌సి ఉత్తర్వులపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

సౌర, పవన విద్యుత్‌కు సంబంధించి యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పిపిఎ) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆమోద ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిల్ దాఖలైంది. దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది.

వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, యాక్సిస్ ఎనర్జీ, ఎపిఇఆర్‌సి కార్యదర్శులకు నోటీసులిచ్చింది. గతేడాది మే 2న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ న్యాయవాది జి శ్రీనివాసరావు వేసిన పిల్‌పై విచారణ డిసెంబరు 10కి వాయిదా పడింది.

'క్రమబద్ధీకరణ' పున:ప్రారంభించాలి

- మహిళా కాంట్రాక్టు లెక్చరర్ల 'ఆవేదన దీక్ష'
- ప్రారంభించిన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంట్రాక్టు లెక్చరర్లు 'ఆవేదన దీక్ష' చేపట్టారు. 36 గంటల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని ధర్నా చౌక్‌లో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు బుధవారం ప్రారంభించారు. ముందుగా సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశలో నిలిచిపోయిన లెక్చరర్లను క్రమబద్ధీకరించే ప్రక్రియను పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జిఓ 114ను తీసుకొచ్చి 10,117 మంది ఉద్యోగులను, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు అర్హులుగా గుర్తించిందన్నారు. ఆచరణలో మాత్రం 3 వేల మందిని చేసిందన్నారు. సుమారు 4,500 మందిగా ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేయలేదన్నారు. అధికారంలోకి వస్తే క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా క్రమబద్ధీకరించకపోవడం అన్యాయమన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రికి, విద్యాశాఖ మంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రాలు అందించామని తెలిపారు. జూనియర్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో



మహిళా కాంట్రాక్టు లెక్చరర్లు 'ఆవేదన దీక్ష' లో మాట్లాడుతున్న పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

పనిచేస్తున్న కాంట్రాక్టు లెచ్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేసి విద్యాశాఖ మంత్రి ఇంటిని, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2023 అక్టోబర్‌లో జారీ చేసిన జిఓ ప్రకారం నేటికీ రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని చెప్పారు. 2014కు ముందు నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన చర్యలను విద్యాశాఖ అధికారులు వెంటనే చేపట్టేలా ఆదేశించాలని కోరారు. ఎఐటియుసి అధ్యక్షులు రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. లెక్చరర్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనలకు తాము అండగా ఉంటామని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి కాంట్రాక్టుకు పనిచేస్తున్న లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజీస్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై జాబ్‌బాబు, మాణిక్యం మాట్లాడుతూ.. 2023 మే, 2025 సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీక్షలో మహిళా లెక్చరర్లు రత్నకుమారి, ఎస్ లత, కె లతారాణి, ఆర్ స్వాతి, దుర్గా మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బిసి రక్షణ చట్టం : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసిలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో బిసి రక్షణ చట్టాన్ని తీసుకురానున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని సచివాలయంలో బిసి సంక్షేమశాఖ మంత్రి నేతృత్వంలో మంత్రులు అనిత, ఎన్‌ఎండి ఫరూక్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి సవిత విలేకరులతో మాట్లాడుతూ.. బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ బడ్జెట్‌లో బిసిలకు రూ.47 వేలకోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిసిలకు రక్షణ చట్టం రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బిసిల ఆత్మగౌరవంతో జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం బిసి మంత్రులు రెండు పర్యాయాలు సమావేశమయ్యామని, త్వరలోనే మరో సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో బిసిలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. టిడిపిలోని బిసి నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారన్నారు. బిసిలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా బిసి రక్షణ చట్టం తీసుకొస్తున్నట్లు తెలిపారు.

బిసి స్టడీ సర్కిళ్లలో ఉత్తమ శిక్షణ

బిసి స్టడీ సర్కిళ్లలో శిక్షణ పొందిన 246 మంది అభ్యర్థులు మెగా డిఎస్‌సిలో ఎంపికయ్యారని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా బిసి స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగ యువతకు ఉచితంగా ఉత్తమమైన శిక్షణ అందిస్తున్నట్లు బుధవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

బిసి స్టడీ సర్కిళ్లను ఉత్తమంగా నిర్వహించినందుకు స్కోచ్ అవార్డు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ఢిల్లీలో అవార్డు అందుకోనున్నట్లు వెల్లడించారు. మెగా డిఎస్‌సిలో 6,470 మందికి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్‌కు 83 మంది బిసి అభ్యర్థులకు శిక్షణ అందించినట్లు వెల్లడించారు. గ్రూప్-2, ఆర్‌ఆర్‌బి, పోలీస్ కానిస్టేబుల్స్ పోస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులు

- ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు వక్ఫ్ స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వక్ఫ్ బోర్డు అనుమతినిచ్చింది. విజయవాడలోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన బోర్డు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశం అనంతరం ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ వివరాలను వెల్లడిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 28 ప్రదేశాల్లో తాలిం ఎ హునర్ పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పలుచోట్ల వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు చెప్పారు. వక్ఫ్ ఆస్తులను కాపాడుతూ.. వాటి ద్వారా సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను చేపడతామన్నారు. బోర్డు కార్యకలాపాలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో బోర్డు సభ్యులు ఎమ్మెల్సీ మొహ్మద్ రుహుల్లా, ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, హుస్సేన్, దావూద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

23న విజయవాడలో మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికులకు పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ధర్నాలు, 23న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ధర్నాను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు లక్షలాది మంది ఒప్పంద కార్మికులు 12వ పిఆర్‌సి కోసం ఎదురుచూస్తున్నారని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత జులైలో జరిగిన సమ్మె కాలానికి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ ఇంతవరకూ చెల్లించలేదన్నారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం.. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పదేళ్ల సర్వీసు ఉన్నవారికి ఉద్యోగ విరమణ చేస్తే రూ.75 వేలు ఆర్థికసాయం, దహన సంస్కారాలకు ఇచ్చే మొత్తం రూ.20 వేలకు పెంచడం, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపు వంటి హామీలు, పర్మినెంట్ ఉద్యోగులకు డిఎ బకాయిలు, సరెండర్ లీవ్స్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి హామీలకు నేటికీ ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు.

తురకపాలెంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి



వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించాలని గుంటూరు జిల్లా నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రజలకు సూచించారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ఇటీవల సంభవించిన అసాధారణ మరణాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలుసుకునేందుకు బుధవారం ఆకస్మికంగా గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులతో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. గతంలో ఉపయోగించిన బావిని, కాలుష్య నీటితో నిండిన చెరువును పరిశీలించారు. తమ గ్రామానికి గుంటూరు కార్పొరేషన్ ద్వారా సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరారు. గ్రామంలో రెండు, మూడు వందల అడుగుల లోతులో బోర్లు వేయాల్సి వస్తోందని, ప్రైవేట్ వ్యక్తులు ఐదు వందల అడుగుల లోతులో బోర్లు వేశారని తెలిపారు. గ్రామంలో బోర్లు వేస్తున్నా పూడుకుపోతున్నాయని కలెక్టర్‌కు చెప్పారు. పారిశుధ్య పరిస్థితి కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటోందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం వస్తున్న తాగునీటి ట్యాంకర్లు సరిపోతున్నాయా లేదా అని ఆరా తీశారు. నీటిపై మూతలు పెట్టాలని, మరగ కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆమె సూచించారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తితే తక్షణం వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్య పరీక్షల వివరాలు తక్షణం గ్రామస్తులకు అందించాలని చెప్పారు.

వైసిపివి తప్పుడు ప్రచారాలు

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరాతవి బ్యూరో

అబద్ధాలే వైసిపి ఎజెండా అని, సోషల్ మీడియాను ఉపయోగించుకుని తప్పుడు ప్రచారాలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తోందన్నారు. వైసిపి నాయకులు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. కులాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి వైసిపి అధినేత వైఎస్ జగన్, మాజీ మంత్రి పేర్ని నాని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

17 మెడికల్ కాలేజీలు ఎక్కడ ? : రామ్‌భూపాల్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో నిర్మించిన 17 మెడికల్ కాలేజీలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని టిడిపి ఎమ్మెల్సీ రామ్‌భూపాల్ రెడ్డి ప్రశ్నించారు. 17 కళాశాలలు నిర్మిస్తామని చెప్పి కేవలం 5 కాలేజీలను ప్రారంభించారని చెప్పారు. దీనివల్ల రాష్ట్ర విద్యార్థులకు రావాల్సిన 1,700 సీట్లను నష్టపోయామని తెలిపారు. 17 కాలేజీల నిర్మాణానికి రూ.8,500 కోట్లు ఖర్చు చేయాలని, జగన్ తన పాలనలో రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చుచేసి నిర్మించానని గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు.

పిజి మెడికల్ సీట్లకు అవసరమైన వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.700 కోట్లను జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. పిపిపి విధానంలో 50 శాతం సీట్లు ప్రతిభ ఆధారంగా, మిగిలిన 50 శాతం సీట్లు ప్రభుత్వం నిర్ణయించే ఫీజుల ధరకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం ఏడాదిలో రూ.7 వేలకోట్లు ఖర్చు పెట్టే ఆర్థిక పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేదన్నారు.

హెల్త్, వెల్త్, హ్యాపీ ప్రభుత్వ నినాదం

- మంత్రులు కొండపల్లి, వాసంశెట్టి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హెల్త్, వెల్త్, హ్యాపీ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని మాజీ సిఎం జగన్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 5 కళాశాలలకు కేవలం గోడలు, స్లాబ్‌లు, రంగులు వేసి కట్టామని చెప్పుకుంటున్నారని, ఇందుకు కేంద్రం నిధులు రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఆయా కళాశాలల్లో రాష్ట్ర వాటాగా మౌలిక సదుపాయాలు, పరికరాల కొనుగోళ్లకు ఇంకా రూ1,900 కోట్లు అవసరమన్నారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలనేది సిఎం చంద్రబాబు ఆశయమని, అందుకు అనుగుణంగా 1995 నుంచి ఆయన పాలనలో రాష్ట్రానికి వైద్య కళాశాలలు తీసుకొచ్చారని వెల్లడించారు.

మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్)కు చెందిన బూడిదను ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో అక్రమంగా డంప్ చేశారంటూ దాని పరిశీలనకు వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రి, వైసిపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి జోగి రమేష్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎన్‌టిటిపిఎస్ బూడిదను అక్రమంగా మూలపాడులో డంప్ చేశారని, దానిని స్థానిక బూడిద లారీల యాజమానులకు పంపిణీ చేస్తామని జోగి రమేష్ ప్రకటించిన నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటి వద్ద పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. జోగి ఇంటి వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న పోలీసులు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో 144 సెక్షన్ విధించారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు వీల్లేదంటూ హెచ్చరించారు. మూలపాడు డంపింగ్ యార్డుకు వెళ్లకుండా రమేష్‌ను అడ్డుకున్నారు. జోగి రమేష్‌ను, పలువురు వైసిపి నేతలను అరెస్టు చేసి విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తర్వాత వారిని విడుదల చేశారు.

వ్యాపారాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యాపారులంతా ఇక నుండి తప్పనిసరిగా తమ వ్యాపారాలను ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాల్సిందే! ఇప్పటివరకు పెద్ద సంఖ్యలో చిన్నా,చితక వ్యాపారులు ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. దీనవల్ల పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతున్నట్లు, చట్ట ప్రకారం రావాల్సిన పన్నులు రావడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అన్ని వ్యాపారాలను రిజిస్టర్ అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులకు ప్రభుత్వం అప్పగించినట్లు తెలిసింది. ఆ దిశలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు జిఎస్‌టి స్లాబుల్లో మార్పు కారనంగా తగ్గే అదాయాన్ని భర్తీ చేసుకునేందుకు వివిధ ఆదాయార్జన శాఖల ద్వారా రావాల్సిన పెండింగ్ బకాయిలను ముక్కుపిండి వసూలు చేయాలని నిర్ణయించింది. దీనికోసం రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కూడా నిర్ణయించింది. పన్ను ఎగవేతదారులను అడ్డుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్లు సహకరించాలని నిర్దేశించింది. అదే సమయంలో మద్యంతో పాటు మరికొన్నింటిపై అదనపు పన్నులను మోపే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే..ఇల్లు క్షేమం

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



దేశ పురోగమనానికి పునాది స్త్రీ శక్తి అని, తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు మొత్తం క్షేమంగా ఉంటుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం 'స్వస్త్ నారీ, సశక్త్‌పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఇంట్లో తల్లి అనారోగ్యం పాలైతే కుటుంబ వ్యవస్థ మొత్తం కుప్పకూలుతుందని, అందుకే మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి బలమైన కుటుంబాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో 'స్వస్త్ నారీ, సశక్త్‌పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వేడుకలతో ముగుస్తాయని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం వేదిక వద్ద ఏర్పాటుచేసిన మోడల్ హెల్త్ కేర్ కియోస్కులను సందర్శించి వైద్య నిపుణులు, రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్, నందిగామ ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, తంగిరాల సౌమ్య, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశా, విజయవాడ సిపి ఎస్‌వి రాజశేఖర్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ జి రఘునందన్, గవర్నర్ జాయింట్ సెక్రటరీ పిఎస్ సూర్యప్రకాష్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖలోనే ఇఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలోనే ఇఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విశాఖ నగరంలోని షీలా నగర్‌లో 2016లో అప్పటి కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ, సిఎం చంద్రబాబు 400 పడకల ఇఎస్ఐ ఆస్పత్రికి శంకుస్థాపన చేశారని, ప్రస్తుతం ఆస్పత్రి ముగింపు దశలో ఉందని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇఎస్ఐ కమిషనర్ మంగళవారం విజయవాడలో మాట్లాడుతూ.. ఇఎస్ఐ ఆధ్వర్యాన వైద్య కళాశాలను అమరావతిలో త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయమని, కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ అమరావతిలోనే పెట్టించాలనే చంద్రబాబు ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం అమరావతిలో ఇఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో అత్యధికంగా 14 లక్షల మంది ఇఎస్ఐ సభ్యులు ఉన్నారని, విశాఖపట్నంలో ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం తుది దశలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి ఎయిమ్స్ అమరావతి వద్ద ఉన్న మంగళగిరిలో ఏర్పాటు చేసినందున, కార్మికులు అత్యధిక సంఖ్యలో ఉన్న విశాఖలో కాకుండా, అమరావతిలో ఇఎస్ఐ వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఇఎస్ఐ ఆస్పత్రి వద్దే కళాశాల ఉండాలని, దీనికి భిన్నంగా ఇఎస్ఐ వైద్య కళాశాలను అమరావతికి బదలాయించడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే కేవలం అమరావతి మాత్రమే కాదని చెప్పారు. వెనుకబడిన ఉత్తరాంధ్రలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన వచ్చే ఇఎస్ఐ వైద్య కళాశాలను ఇఎస్ఐ ఆస్పత్రికి అనుబంధంగా ఏర్పాటు చేయాలన్నారు.

మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టాలనే నిర్ణయాన్ని సిపిఐ స్వాగతిస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ప్రకటించినందున, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించి, విశ్వసనీయత కల్పించాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టుల నిర్ణయం శాంతి సయోధ్య, ప్రజాస్వామ్య సంభాషణ దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని వెల్లడించారు. ఆయుధ పోరాటాన్ని విడనాడి ప్రజాస్వామ్య పద్ధతులతో సమస్యలను పరిష్కరించుకోవాలని భావించడం హర్షణీయమన్నారు. కేవలం అణచివేతతో సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకుని, రాజకీయ పరిపక్వతను ప్రదర్శించి, త్వరగా అర్థవంతమైన చర్చలను ప్రారంభించాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తుందన్నారు.

భార్యా బిడ్డతో సహా వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)



పూర్ణకుమారి (ఫైల్), వెంకటేశ్ (ఫైల్)

అప్పుపెట్టిన చిచ్చు కుంటుబాన్ని చిన్నాభిన్నం చేసింది. దీంతో, వ్యవసాయ బావిలో దూకి తల్లీకొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఫణిదం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అదే గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుకు ఆరు నెలల కిందట రూ.50వేలు అప్పుగా ఇచ్చాడు. రోజులు గడుస్తున్నా అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో శ్రీనివాసరావు, ఆయన కుమారుడు వెంకటేష్ కలిసి మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి గట్టిగా అడిగారు. ఈ క్రమంలో గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన వెంకటేశ్వర్లు కొద్దిసేపటికి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కుటుంబీకులు ఆయనను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. దీంతో, భయపడిన శ్రీనివాసరావు భార్య రామనాథం పూర్ణకుమారి (42), ఆయన కుమారుడు వెంకటేష్ (25) కలిసి బుధవారం ఉదయం వారు కౌలుకు సాగు చేస్తున్న పొలం వద్దకెళ్లి పొలంలోని బావిలో దూకాలని నిర్ణయించుకున్నారు. అయితే బావిలో దూకడానికి భయపడిన శ్రీనివాసరావు ఇంటికెళ్లి పురుగు మందు తాగి, ఈ విషయాన్ని భార్య, కుమారుడికి చెప్పగా, వారిద్దరూ బావిలో దూకేశారు. అనంతరం శ్రీనివాసరావు నరసరావుపేట ప్రాంతంలోని పమిడిపాడులో ఉంటున్న తన కుమార్తె, అల్లుడుకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. దీంతో వారు వచ్చి శ్రీనివాసరావును సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రికి అనంతరం, మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు పొలంలోని బావి వద్దకెళ్లి పూర్ణకుమారి, వెంకటేష్ మృతదేహాలను వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సత్తెనపల్లి రూరల్ సిఐ ఎంవి సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు సాంకేతిక విద్య : మంచు లక్ష్మి

- పల్నాడులో పది ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి (పల్నాడు జిల్లా)


డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న మంచులక్ష్మీ

పల్నాడు జిల్లాలో పది ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు సినీనటి మంచులక్ష్మీ తెలిపారు. అమరావతి మండలం ధరణికోటలో డిజిటల్ ఫర్ చేంజ్, పెగాసిస్టమ్స్ ఇండియా సంయుక్తంగా బుధవారం డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచులక్ష్మీ మాట్లాడుతూ పేద విద్యార్థులకు కూడా ఉన్నతమైన సాంకేతిక విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. టీచ్ ఫర్ చేంజ్ ద్వారా కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో డిజిటల్ క్లాస్ రూములు ఏర్పాటవుతున్నాయన్నారు. మొత్తం పది పాఠశాలల్లో 605 మంది విద్యార్థులకు మేలు జరుగుతుందని పెగా సిస్టమ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ ధరణికోట సుయోధన్ తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 605 మంది విద్యార్థులకు చేయూత అందించేందుకు పలు రాష్ట్రాల్లో స్మార్ట్ క్లాస్ రూమ్స్ అభివృద్ధికి ఈ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు.





శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో యుటిఎఫ్ రణభేరి ఢంకాను మోగించి యాత్రను ప్రారంభిస్తున్న గేయానంద్, యుటిఎఫ్ నాయకులు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జాతాకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం : గేయానంద్
- యాప్‌ల భారాలను తొలగించాలి : ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతాలు బుధవారం శ్రీ సత్యసాయి, అన్నమయ్య, బాపట్ల, నెల్లూరు, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొనసాగాయి. జాతాలకు ఆయా చోట్ల ఘన స్వాగతం లభించింది. డిఎ, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు. నెల్లూరు జిల్లా పొదలకూరులో జాతానుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు గత ఐదు సంవత్సరాలలో అనేక విధాలుగా నష్టపోయారన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని ఎంఆర్‌సి కార్యాలయం నుంచి ప్రారంభమైన జాతా సీతానగరం, రాజానగరం, రాజమహేంద్రరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో సాగింది. అనంతరం మండపేట వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రవేశించింది. తాళ్లరేవు, యానాం, ముమ్మిడివరంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ... బోధనేతర పనుల కారణంగా ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, యాప్‌ల భారాలను తొలగించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన రణభేరి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌తో పాటు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ ప్రారంభించారు. గేయానంద్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన టిడిపి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి ఎంపిడిఒ కార్యాలయం నుంచి ప్రారంభమైన జాతా రామభద్రపురం, గజపతినగరం మీదుగా విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మురళీమోహన్, కిషోర్, కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడారు. ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. డిఎ చెల్లించి పిఆర్‌సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు.

అన్నమయ్య జిల్లా రాయచోటిలో బంగ్లా సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా డిఇఒ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం మాదిరే టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అసెంబ్లీ, క్యాబినెట్ సమావేశాల్లో చర్చించి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాపట్లలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిలకలగెడ్డ పాఠశాల వద్దకు జాతా చేరుకుంది. అనంతగిరి మండల యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవుడు బృందానికి స్వాగతం పలికారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రజాహితం లేని కలెక్టర్ల కాన్ఫరెన్స్

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండు రోజులపాటు నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ప్రజాహితం లేదని, మసిపూసి మారేడుకాయ చేసేలా చంద్రబాబు వ్యవహరించారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించడమే ఎజెండాగా, ప్రజా సమస్యలు ఏవీ చర్చకు రాకుండా చేశారని తెలిపారు. రైతు సమస్యలపై మాట ప్రస్తావన కూడా చేయకపోవడం దారుణమన్నారు. పొలిటికల్ గవర్నెన్స్ వల్ల జరిగిన నష్టాన్ని రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల నెలకొన్న హింసను అధికారులపై నెట్టేశారని తెలిపారు. ప్రభుత్వ జవాబుదారీతనం ఈ సమావేశం ద్వారా ప్రజలకు తెలియాలని, అటువంటిదేమీ లేకుండానే కార్యక్రమం ముగించారని విమర్శించారు.

ప్రజాస్వామ్య విధ్వంసకారుడు సిఎం : లక్ష్మీపార్వతి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య విధ్వంసకారుడని, అలాంటి వ్యక్తిని ఆదర్శ నాయకుడని వెంకయ్యనాయుడు కీర్తించడం బాధించిందని వైసిపి ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. వెన్నుపోటు సమయంలో ఎన్‌టిఆర్‌ను వెంకయ్యనాయుడు కనీసం పరామర్శించలేదన్నారు. ముఖ్యమంత్రి కోసం జగన్ పాలనను విమర్శించడం తప్పని, తన మాటలను వెంకయ్యనాయుడు సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ : సతీష్‌రెడ్డి

ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందని వైసిపి నాయకులు సతీష్‌రెడ్డి విమర్శించారు. ఏమీ చేయని కార్యక్రమానికి కోట్ల రూపాయలు వెచ్చించి తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

విశ్వకర్మకు నివాళి

వైసిపి కేంద్ర కార్యాలయంలో భగవాన్ విశ్వకర్మకు నాయకులు నివాళి అర్పించారు. చేతివృత్తి ద్వారా సమాజానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. యాంత్రీకరణతో చేతివృత్తిదారులు పేదరికంలోకి వెళుతున్నారని నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, అంకంరెడ్డి నాగనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ నుంచి దశలవారీగా టిడ్కో ఇళ్ల పంపిణీ

- మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ

ప్రజాశక్తి - ఏలూరుసిటీ

రాష్ట్రంలో పేదలకు జూన్ నాటికి పూర్తిస్థాయిలో టిడ్కో ఇళ్లు అందిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. ఏలూరులోని పోణంగిలో గల టిడ్కో గృహాల సముదాయాన్ని ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు దశల వారీగా డిసెంబర్ నుండి జూన్ నాటికి టిడ్కో ఇళ్లను అందిస్తామన్నారు. రాష్ట్రంలో 160 ప్రదేశాల్లో టిడ్కో ఇళ్ల సముదాయాలను నిర్మిస్తున్నామని, వాటిలో 80 ప్రాంతాల్లో పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. 430, 365 చదరపు అడుగుల విస్తీర్ణంగల టిడ్కో గృహాలను డిసెంబర్ నాటికి పూర్తి చేసి అందిస్తామని, 2026 మార్చి, జూన్ నాటికి మిగిలిన ఇళ్లను పూర్తిచేసి లబ్దిదారులకు అందిస్తామని చెప్పారు. టిడ్కో కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి వెంట కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేడర్ స్ట్రెంత్ తగ్గింపు తగదు : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాన్ ఆపరేషన్ యూనిట్లలో 125 పిఎల్ పేరుతో కేడర్ స్ట్రెంత్ కుదింపు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్టు డిపార్టుమెంట్ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, జనరల్ సెక్రటరీ ఎం అయ్యప్పరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత 32 ఏళ్లుగా నాన్ ఆపరేషన్ యూనిట్లలో పనిచేస్తున్న కేడర్ స్ట్రెంత్ ఉద్యోగోన్నతి కోసం ఎదురుచూస్తున్న సమయంలో 125 పిఎల్ పేరుతో సూచిక-2లో తెలిపిన ఉత్తర్వుల ద్వారా వారిని తగ్గించడం అన్యాయమన్నారు. ప్రధానంగా నెల్లూరు నాన్ ఆపరేషన్ యూనిట్లలో గతంలో సూచిక-1లో ఉన్న కేడర్ స్ట్రెంత్‌ను తగ్గించడంతో దాదాపు ఎవరికీ రాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్కుషాప్‌లో ప్రొడక్షన్ సకాలంలో క్వాలిటీగా చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తున్న లీడింగ్ హ్యాండ్ పోస్టులను నాలుగు నుంచి రెండుకు కుదించడం, వెల్డర్ పోస్టును రద్దు చేయడం, మెకానిక్స్ గ్రేడ్-1 పోస్టులను 9 నుంచి 5కు కుదించడం, మెకానిక్ గ్రేడ్-2 పోస్టులను 19 నుంచి 11కు కుదించడం, మిషనరీ వర్క్ ఉన్నప్పటికీ మిషనిస్ట్ పోస్టులను మూడు నుంచి ఒకటికి కుదించడం నష్టదాయకమని తెలిపారు.



శ్రీశైలానికి పెరిగిన వరద ప్రవాహం

- నాలుగు గేట్ల ద్వారా నీరు విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,77,059 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 29,154, హంద్రీ నుంచి 1,125 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,07,338 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతున్నాయి. దీంతో డ్యామ్ నాలుగు గేట్లను ఎత్తి దిగువ సాగర్‌కు 1,11,016 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జలాశయ నీటి మట్టం 885 అడుగులకు గాను 884.30కు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215.80 గాను 211.47 59 టిఎంసిలుగా నమోదైంది.

'బల్క్ డ్రగ్'ను రద్దు చేస్తూ అసెంబ్లీలో ప్రకటించాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

పర్యావరణానికి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే బల్క్ డ్రగ్ పార్కును రద్దుచేస్తూ అసెంబ్లీలో ప్రకటించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 4వ రోజుకు చేరుకున్నాయి.

మండుటెండను సైతం లెక్కచేయకుండా మత్స్యకారులు ఆందోళన కొనసాగించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు, జడ్‌పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ తదితరులు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్‌ను ఏర్పాటుచేసి స్మశానంగా మార్పు చేసేందుకు కుట్ర జరుగుతోందని, దీనిని పార్టీలకతీతంగా ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బల్క్ డ్రగ్ అత్యంత ప్రమాదకరమైన కంపెనీ అని, ఈ ప్రాంతంలో ఎవరూ నివసించలేని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు.



మత్స్యకారుల ఆందోళలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, కంపెనీ వెదజల్లే కాలుష్యం వల్ల కళ్లు కనిపించవని, కేన్సర్, చర్మవ్యాధులతో పాటు గర్భస్రావాలు వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. దేశంలో హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోని తొండంగిలో ఈ పరిశ్రమ పెట్టేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఎక్కడా ఈ పరిశ్రమ పెట్టలేదని తెలిపారు. తొండంగిలో ఏర్పాటు చేయాలనే ప్రయత్నాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తే, నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే హెటిరో పరిశ్రమ వల్ల మత్స్య సంపద నశించిపోయి, మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని, అనేక వ్యాధుల బారిన పడ్డారని, బల్క్ డ్రగ్ వస్తే వారి మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు.

జిఎస్‌టి తగ్గిందంటూ భారీ వ్యాపారానికి కంపెనీల వ్యూహం

- 22 నుంచి ఆఫర్లు ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్ర

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో



కేంద్రం జిఎస్‌టి శ్లాబులను మార్చింది. జనానికి ఎంత లాభమో స్పష్టత లేదుగానీ, ఇప్పుడు దాన్ని అడ్డంపెట్టుకుని పలు కంపెనీలు ఆఫర్ల పేరుతో సరుకు అమ్ముకునేందుకు భారీగా వ్యూహం పన్నాయి. ఈ నెల 22 నుంచి జిఎస్‌టి కొన్ని వస్తువులపై పెంచారు. కొన్నింటిపై తగ్గించారు. ధరల్లోనూ ఈ వ్యత్యాసాలు ఉంటాయి. దీన్ని పలు వ్యాపార సంస్థలు తమ లాభాల కోసం వినియోగించుకునే ప్రక్రియను చేపట్టాయి. జిఎస్‌టి తగ్గిందనే ప్రచారంతో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాలు వస్తువుల కొనుగోళ్లపై ఇప్పటికే దృష్టి సారించాయి. ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల్లో ఇప్పుడు చిన్నకార్ల వినియోగం పెరిగింది. ఈ నెల 22 నుంచీ కార్ల ధరలు తగ్గుతాయనే ధీమాతో ఉన్నారు. ఎందుకంటే చిన్నకార్లపై జిఎస్‌టి 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది (పెద్ద కార్లపై 40 శాతం పెంచారు). దీంతో, మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగింది. కార్ల కంపెనీలు కూడా ఇటీవల ఆఫర్లు ప్రకటించి కార్లను భారీగానే అమ్మాయి. ఇప్పుడు జిఎస్‌టి తగ్గినందున కార్ల ధరలు ఎంతోకొంత తగ్గించాలి. జిల్లాల్లో ఎన్నో విదేశీ కార్ల షోరూములు పెట్టారు. జనం కార్ల షోరూములకు వెళ్లి మోడళ్లను చూసుకుంటున్నారు. ఇప్పుడున్న ధరలు ఎంత? జిఎస్‌టి తగ్గించాక ఎంతధర తగ్గుతుందనే సమాచారం తీసుకుంటున్నారు. మోటారు సైకిళ్లపైనా జిఎస్‌టి తగ్గించారు. వీటి ధరలు కూడా తగ్గనున్నాయి. జిఎస్‌టి తగ్గుతుందనే చర్చతో చాలామంది కొనుగోళ్లు వాయిదా వేసుకుంటున్నారు. ఇక ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్ర వంటి ఆన్‌లైను పోర్టర్లు భారీ ఆఫర్లు ప్రకటించాయి. ఈ నెల 22 నుంచీ ప్రత్యేక డిస్కంట్ల పేరుతో వస్తువులను భారీగా అమ్మడానికి ప్రచారం మొదలు పెట్టాయి. యువత ఆఫర్ల సమయం కోసం, తమకు కావాల్సిన వస్తువులను ఆ రోజు బుక్ చేసుకునేందుకు ఎదురుచూస్తోంది. అన్ని రకాల బ్రాండెడ్ వస్తువులపై ఆఫర్లు ఇచ్చారు. సెల్‌ఫోన్ల ధరలూ తగ్గిస్తున్నారు. అన్ని విదేశీ కంపెనీలు తమ బ్రాండెడ్ రెడీమేడ్ దుస్తులపై భారీగా తగ్గింపు ఇస్తున్నాయి. 40 నుంచి 50 శాతంపైగా డిస్కౌంటు ఇచ్చే వస్తువులను పోర్టర్లలో ముందుగానే పెడుతున్నారు. వాటికోసం ఎగబడుతున్నారు. ఆన్‌లైన్లో కోట్లలో వ్యాపారం జరుగుతోంది. ఇప్పుడు దుకాణాల్లో కొంటే ధరలు తగ్గింపు తక్కువగా ఉంది. దీంతో, ఇప్పుడు వ్యాపారంలో 50 శాతంపైగా కొనుగోళ్లు ఆన్‌లైను పోర్టర్లలోనే నడుస్తున్నాయి. వస్తువులను ఆన్‌లైన్‌లోనే కొంటున్నారు. ప్రతి కంపెనీ తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా కూడా అమ్మకాలకు అవకాశం కల్పించింది. వీటివల్ల పట్టణాల్లో ఎప్పటి నుంచో ఉన్న దుకాణాల వ్యాపారాలు సగానికి సగం పడిపోయాయి. ఇక్కడ దుకాణంలోకొనే వస్తువు ధరకూ, ఆన్‌లైన్‌లో కొనే అదే వస్తువు ధరకూ తేడాలు ఉంటున్నాయి. అందుకే యువతకు ఆన్‌లైన్ వైపే అలవాటైపోయింది. జిఎస్‌టి తగ్గింపు పేరుతో కంపెనీలు ఎప్పటి నుంచో నిల్వలుగా పేరుకుపోయిన వస్తువులను అమ్ముకునేందుకు భారీగా వ్యూహం వేశాయి.

కాకినాడ జిల్లాలో కలకలం

- బావిలో రెండు మృతదేహాలు లభ్యం
- హత్యలుగా అనుమానం

ప్రజాశక్తి - గొల్లప్రోలు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లాలో రెండు మృతదేహాలు లభ్యం కావడంతో కలకలం రేపింది. పోలీసులు ఇది హత్యగా అనుమానిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని ఒక బావిలో రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు తాటిపర్తికి చెందిన రంపం శ్రీనివాస్(50), తోలేటి సూరిబాబు(35) గా నిర్ధారించారు. వారు వరుసకు మామ, అల్లుడు అవుతారు. గ్రామంలోనే కౌలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కౌలు చేస్తున్న పొలంలో ఉన్న బావిలోనే బుధవారం ఉదయం వారు శవాలై తేలారు. ఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్‌పి మనీష్‌దేవరాజ్ పాటిల్, పిఠాపురం సిఐ జి శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ కుమారుడు వీరవెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేసి ఉంటారనే కోణంలో విచారణ చేస్తున్నామని, ఈ కేసుకు సంబంధించి అనుమానితుడిని గుర్తించామని, విచారణ అనంతరం ఇతర వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సూరిబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'బర్లీ'పై నిషేధం... 'వర్జీనియా' కుదింపు

- గందరగోళంలో పొగాకు రైతులు
- ఏయే పంటలు వేయాలో, ఎంత ధర ఇస్తారో ప్రకటించని ప్రభుత్వం

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో



ఈ ఏడాది బర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం నిషేధం విధించింది. వర్జీనియా పొగాకు సాగు లక్ష్యాన్ని కుదించింది. అయితే, వీటికి ప్రత్యామ్నాయంగా ఏ పంటలను సాగు చేయాలో, వాటికి ఎంత ధర కల్పిస్తారో, ఏ మేరకు కొంటుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో, పొగాకు రైతులు అయోమయంలో పడ్డారు. గత సీజన్లో పండించిన పొగాకు కొనుగోళ్లు నేటికీ కొనసాగుతున్నాయి. మార్చిలో వర్జీనియా పొగాకు వేలం మొదలైంది. ఇప్పటివరకూ 96 మిలియన్ల కొనుగోలు జరగ్గా, ఇంకా 62 మిలియన్ల రైతుల వద్దే ఉంది. సగటు ధర రూ.236. వ్యాపారులు సిండికేటై తక్కువ ధరకే నాణ్యమైన పొగాకు 80 శాతంపైగా కొనేశారు. తక్కువ ధరకు బ్రైట్ గ్రేడును ఈపాటికే రూ.220కు ఎక్కువ శాతం కొనుగోలు చేశారు. ఇప్పుడు ఎక్కువ శాతం లోగ్రేడు వస్తోంది. రైతుల వద్ద బ్రైట్ గ్రేడ్ పది శాతం ఉంది. ఇప్పుడు గరిష్ఠ ధర రూ.300 దాటింది. కొనుగోళ్లు పూర్తయ్యాక ధర పెంచినా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. లోగ్రేడ్ 40 శాతం వరకూ ఉంది. దీనిని కిలోను రూ.120 చొప్పున మాత్రమే కొంటున్నారు. లోగ్రేడుకు రూ.200 ధర ఇస్తే తప్ప గిట్టుబాటు కాదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్ సంక్షోభానికి పరిష్కారం చూపకుండానే మళ్లీ ఈ ఏడాది పొగాకు పంట లక్ష్యం ఖరారైంది. పొగాకు బోర్డు గతేడాది 167 మిలియన్ కిలోల వర్జీనియా పొగాకు సాగుకు అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది 142 మిలియన్ కిలోలకే పరిమితం చేసింది. సాగు లక్ష్యాన్ని గతం కన్నా తగ్గించి బ్యారన్‌కు 35 క్వింటాళ్లను అనుమతించింది. ప్రత్యామ్నాయ పంటలు పండించాలని సూచించిన ప్రభుత్వం మార్కెట్ సమస్యలు రాకుండా చూస్తుందా? ఇతర సమస్యలు పరిష్కరిస్తుందా? అనే ప్రశ్నలకు నేటికీ స్పష్టత లేదు. దీంతో, పొగాకు తగ్గించిన చోట, బర్లీ పూర్తిగా ఆపేసిన ప్రాంతాల్లో ఏ పంటలు వేసుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పొగాకు బదులు శనగ వేయగా దానికీ ధర రాలేదు. మిర్చి వేయగా, దీని పరిస్థితి అదే విధంగా ఉంది. మొక్కజొన్న వేసినా దానికీ ధర తగ్గింది.

దిక్కుతోచని స్థితిలో బర్లీ పొగాకు రైతులు

బాపట్ల జిల్లాలో బర్లీ పొగాకు ఎక్కువగా ఉంది. ప్రకాశంలో కొద్దిగా ఉంది. ఈ ఏడాది 80 మిలియన్ కిలోల వరకూ బర్లీ పొగాకు పండినట్లు అంచనా. వ్యాపారులు కొనలేదు. రైతులు, ప్రతిపక్షాల ఆందోళన మేరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించింది. కొనుగోళ్లు ప్రారంభించిన మార్క్‌ఫెడ్ వ్యాపారులవైపే చూస్తోంది. కొనుగోళ్లలో వేగం లేదు. రైతులకు దశల వారీగా డబ్బులు ఇస్తున్నారు. ఇప్పటి వరకూ 20 మిలియన్లు కొనుగోలు చేసినట్లు అంచనా. ఇంకా 50 మిలియన్లకుపైగా ఉంది. కొంత వ్యాపారులు కొంటున్నారు. బర్లీ పొగాకును ఇళ్ల వద్ద, ఆరుబయట రైతులు ఉంచారు. వర్షాలతో వీరు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది బర్లీ పొగాకు సాగుపై నిషేధం విధించింది.


'బర్లీ' పూర్తిగా కొనాలి : రైతు సంఘం

బర్లీ పొగాకును పూర్తిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. వర్జీనియా పొగాకు వేలంలోనూ దోపిడీ కొనసాగుతోంది. లోగ్రేడుకు కనీసం క్వింటాలుకు రూ.20 వేలు ఇస్తే తప్ప రైతులు బయటపడే పరిస్థితి లేదు. పొగాకు తగ్గించిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ఏయే పంటలు వేసుకోవాలి? ధర ఎంత ఇస్తారనే దానిపై స్పష్టంగా ప్రభుత్వం ప్రకటన చేయాలి

-ఎపి రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు

ట్రంప్ టారిఫ్‌లతో అమెరికాకు తగ్గిన ఎగుమతులు

- మూడు నెలలుగా నేల చూపులు
- సెప్టెంబర్‌లో మరింత తీవ్రం..!



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు భారత ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువుల ధరలు అక్కడ భారీగా పెరగడంతో మన ఎగుమతులు పడిపోయాయి. గడిచిన ఆగస్టు నెలలో అమెరికాకు ఎగుమతులు 16.3 శాతం పతనమై 6.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. భారత్‌పై ట్రంప్ ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించడంతో ఎగుమతులు అమాంతం తగ్గాయి. దీంతో వరుసగా మూడో మాసంలోనూ ఎగుమతుల్లో పతనం చోటు చేసుకున్నట్లయ్యింది. ఇంతక్రితం జులై ఎగుమతుల్లో 3.6 శాతం, జూన్‌లో 5.7 శాతం చొప్పున క్షీణించాయి. చివరి సారిగా అమెరికాకు భారత ఎగుమతులు మే నెలలో 4.8 శాతం పెరిగి 8.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

ట్రంప్ టారిఫ్‌ల వల్ల అమెరికా మార్కెట్‌లో భారత వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో మన ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిందని థింక్‌టాంక్ సంస్థ జిటిఆర్‌ఐ వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టు 7 నుంచి భారత్‌పై అమెరికా 25 శాతం టారిఫ్‌ను విధించగా.. ఆ తర్వాత 27 నుంచి దానిని 50 శాతానికి చేర్చింది. ఇందుకు రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని సాకుగా చూపిన విషయం తెలిసిందే.

భారీగా టారిఫ్‌ల పెంపు ఎగుమతుల పతనానికి కారణమని జిటిఆర్‌ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. గత మూడు నెలల పరిణామాలు, గణాంకాలను పరిశీలిస్తే సెప్టెంబర్‌లో ఎగుమతుల పతనం తీవ్రంగా ఉండొచ్చని విశ్లేషించారు. పూర్తిస్థాయిలో టారిఫ్‌ల దెబ్బ తీవ్రత ఈ నెలలోనే తెలుస్తుందని అన్నారు. ఏప్రిల్ 4 వరకు అమెరికా అత్యంత విశ్వసనీయ దేశం హోదాలో భారత సరుకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎగుమతయ్యాయి. ఇటీవల భారత వస్త్రాలు, ఆభరణాలు, తోలు, రొయ్యలు , కార్పెట్‌లు వంటి రంగాలపై ట్రంప్ భారీగా సుంకాలను విధించిన విషయం తెలిసిందే. 2026 ఆర్థిక సంవత్సరం చివరి వరకు 50 శాతం సుంకాలు కొనసాగితే భారత్ నుంచి యుఎస్ ఎగుమతుల్లో 30-35 బిలియన్ డాలర్లను కోల్పోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది భారత వాణిజ్య లోటును తీవ్రంగా పెంచొచ్చని విశ్లేషిస్తున్నారు. భారత మొత్తం ఎగుమతుల్లో 20 శాతం అమెరికాకే వెళ్తున్నాయి.

సంపాదకీయం


పెచ్చరిల్లిన మితవాదం

ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తులు పెచ్చరిల్లడం ఆందోళనకరం. మన దేశంతో పాటు, అనేక దేశాలను వలసలుగా చేసుకుని రవి అస్తమించని సామ్రాజ్యంగా వినుతికెక్కిన బ్రిటన్.. వలసలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తూ జాతీయ దురభిమానాన్ని ప్రపంచానికి ప్రదర్శిస్తోంది. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్.. గాజాలో జాతి నిర్మూలన విధ్వంసకాండ సాగిస్తోంది. ప్రపంచానికి పెద్దన్నగా తనకుతాను కిరీటం తగిలించుకున్న అమెరికాలో ట్రంప్ 'అమెరికా ఫస్ట్' అన్న నినాదం ఇచ్చారు. గ్రేట్ అమెరికా అగైన్ అంటూ ఉద్దేశపూర్వకంగా అక్కడి ప్రజలను రెచ్చగొడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మితవాదం ఇలా పెచ్చరిల్లడానికి నయా ఉదారవాద ఆర్థిక విధానపు దుష్ఫలితాలు కారణం. కార్పొరేట్ల ఖజానాలతో పాటు సొంత పొట్టలు నింపుకోవడం తప్ప పాలకులకు మరో ధ్యాస లేకపోవడంతో ప్రజల కనీస అవసరాలు తీరడం సైతం గగనంగా మారింది. దీంతో పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహాన్ని, ముఖ్యంగా యువతలో అసంతృప్తిని పక్కదోవ పట్టించేందుకు పాలకులు ఒక వ్యూహం ప్రకారం మితవాదాన్ని, జాత్యహంకారాన్ని రెచ్చగొడుతున్నారు. దీనికి కార్పొరేట్ శక్తులు మద్దతిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే దీనికి నిదర్శనం.

అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ జరుపుతున్న జాత్యాహంకార యుద్ధంలో ఇప్పటి వరకు 63 వేల మందికిపైగా మరణించినట్లు అంచనా! గాజాను నేలమట్టం చేసి అక్కడ విలాసవంతమైన రిసార్టును నిర్మించాలన్న ట్రంప్ ఆలోచనకన్నా దుర్మార్గమేముంది! చౌకగా లభించే కార్మికులతో అత్యధిక లాభాలు ఆర్జించేందుకు మనదేశంతో పాటు, అన్ని మూడవ ప్రపంచ దేశాలపై ప్రపంచీకరణ విధానాలను రుద్దింది అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాల్లోని పెట్టుబడిదారీ వర్గం, పాలకులు కలిసే కదా! ఈ ఉదారవాద విధానాలతో పాటే అనేక దేశాల్లో మితవాదం కూడా బలపడింది. ఆ విధానాల ఫలితంగా కొద్ది మంది ఆస్తులు కొండల్లా పెరుగుతుంటే, మరోవైపు మితవాదపు విద్వేషం ఆ దేశాల్లోని ప్రజల మెదళ్లలో నిండిపోతోంది. ఇక్కడి కార్మికుల నెత్తుటితో పండిన లాభాల పంటను తమ ఖజానాలను నింపుకున్నారేగానీ, తమ సొంత దేశాల్లోని సామాన్యుల కష్టాలు పట్టించుకున్నారా? పట్టించుకొని ఉంటే అగ్రరాజ్యంగా చెప్పుకుంటూనే ఇతర దేశాలతో పోల్చుకుని గుండెలు బాదుకునే పరిస్థితి దాపురించేదా? అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి జాతీయవాద ముసుగులు వేసుకుని దురభిమానాలను రెచ్చగొడుతున్నారు కదా! భూగోళంలో మూడవ వంతు భాగాన్ని తన వలసగా మార్చుకున్న బ్రిటన్ ఇప్పుడు వలసదారులను చూసి భోరుమనడం, దానికి ప్రపంచ బడా పెట్టుబడిదారుల్లో ఒకరైన ఎలన్‌మస్క్ మద్దతివ్వడం దేనికి సంకేతం? నిజానికి తక్కువ జీతాలకే వస్తున్నారంటూ వలసలను ప్రోత్సహించింది అక్కడి పాలకులు, పెట్టుబడిదారీ వర్గం కాదా! పెద్దయెత్తున వస్తున్న అనధికార వలసదారులను చూసీచూడనట్లు ఊరుకున్న చరిత్ర బ్రిటన్, అమెరికాలకు లేదా? అలా వస్తున్న వలసదారులను తమ దేశంలోని కార్మికులకు పోటీగా నిలిపి వారి వేతనాలను గణనీయంగా తగ్గించిన విషయం నిజం కాదా? అప్పుడు ఊరుకున్నా, ఇప్పుడు పెడబొబ్బలు పెట్టేలా యువతను రెచ్చగొడుతున్నా దానికి కారణం ఒక్కటే... అదే అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారుల ప్రయోజనం!

మన దేశమూ దీనికి అతీతం కాదు! నయా ఉదారవాద దుష్పరిణామాలు ఇప్పుడు దేశమంతా అనుభవించాల్సి వస్తోంది. సంస్కరణల్లో భాగంగా చేపట్టిన అమెరికా అనుకూల వైఖరి ఇప్పుడు మొదటికే మోసంగా మారుతోంది. ట్రంప్ టారిఫ్‌లతో వ్యవసాయం నుండి స్టార్టప్‌ల వరకు అన్ని రంగాలు కుదలయ్యే పరిస్థితి ఏర్పడింది. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం సామాన్యుల బతుకులను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఫలితంగా పెల్లుబుకే ఆగ్రహం నుండి ప్రజానీకాన్ని పక్కదోవ పట్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలో కార్పొరేట్ల కనుసన్నల్లో నడిచే బిజెపి ప్రభుత్వానికి ఉన్న ఒకేఒక మార్గం మతోన్మాదాన్ని పెంచడం! ఇప్పటికే ఆ దిశలో సంకేతాలు కనపడుతున్నాయి. ప్రజానీకం, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను చీల్చే ప్రతి ప్రయత్నాన్నీ ప్రతిఘటించి ఐక్యంగా నిలవాలి.

మహనీయుల మాట



సిద్ధాంతాలు లేని జీవితాన్ని గురించి చెప్పుకోవడానికి ఏమీ ఉండదు. వాటి కోసం పోరాడటాన్ని మించిన గొప్ప ఆనందం మరొకటి ఉండదు.
- ఫైడల్ కాస్ట్రో

నాడు దేశాలు ఆక్రమించి, నేడు వలసల వివాదమా?

విశ్లేషణ

వి. రాంభూపాల్

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దేశంలో అక్రమంగా వలసదారులు వున్నారని, విద్యార్థి వీసాలతో వచ్చి ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారని సంకెళ్ళు వేసి వారిని ఆయా దేశాలకు పంపిన తీరు చూశాం. బ్రిటన్‌లో వున్న వలసదారులందరినీ వెనక్కి పంపేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆదివారం లక్ష మందికి పైగా అక్కడి ప్రజలు లండన్‌లో ప్రదర్శన చేశారు. ఇది బ్రిటన్ చరిత్రలోనే అతి పెద్దదట! దేశాలనే వలస దేశాలుగా మార్చుకుని వందల సంవత్సరాలు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పాలించిన బ్రిటన్ నేడు వలసదారుల గురించి మాట్లాడుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచంలోని విజ్ఞానవేత్తలను, నిరుద్యోగ యువతను ఆశ పెట్టి తక్కువ వేతనాలతో పని చేయించుకున్న అమెరికా వలసదారులు వెళ్లిపోవాలంటోంది. పోరాటం అనే పదం గిట్టని ప్రపంచ కుబేరుడు, టెస్లా వ్యవస్థాపకుడు అయిన ఎలాన్ మస్క్ 'పోరాడండి, లేదంటే చస్తారు' అని బ్రిటన్ ప్రదర్శనకారులను హెచ్చరించాడు. "ప్రపంచం కుగ్రామమైంది, దేశాల సరిహద్దులు రద్దు అవుతున్నాయి, ఏ దేశ పౌరులైనా ఏ దేశంలోనైనా జీవించే యుగం వచ్చిందని". మూడు దశాబ్దాల క్రితం చెప్పిన ప్రపంచీకరణ దేశాల నేతలేనా నేడు వలసదారుల గురించి మాట్లాడుతున్నది? ఇదంతా పెట్టుబడి వైపరీత్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక రుగ్మతలకు ప్రపంచంలోని అత్యధిక దేశాలు చాలా కాలంగా గుల్ల అవుతున్నాయి. ఈ రోగం ముదిరి సామ్రాజ్యవాద దేశాలకు వ్యాపించింది. తన వరకు వస్తేగాని తత్వం బోధపడదన్నట్లు ఇప్పుడు ఈ దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా అనేక దేశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా దోచుకు తిని బలిసిపోయిన సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు చిక్కిశల్యమైపోతున్నాయి. 'మీరు ఒక్కరు-మేము 99 మందిమి" అని అక్కడి యువత నిలదీస్తోంది.

> వలసదారుల గురించి మాట్లాడుతున్న ట్రంప్ (ఈయన తాత జర్మనీకి చెందినవాడు), ఎలాన్ మస్క్ (దక్షిణాఫ్రికా నుండి అమెరికాకు వలస వచ్చాడు)లు కూడా వలసదారులే. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన సంక్షోభం నుండి గట్టెక్కడానికి వలసదారులను, ముఖ్యంగా ముస్లింలను శత్రువులుగా చూపిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా మన దేశంలో ఇలాంటి శక్తులు అధికారంలోకి వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోగా మత ఉద్రిక్తతలు, మత ఘర్షణలు ఎలా పెంచుతున్నాయో చూస్తున్నాము. మితవాద శక్తులు ఎక్కడ బలపడినా అది మానవ వినాశానికే దారి తీస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి చరిత్ర చెబుతున్న సత్యం ఇదే. ఆర్థిక వ్యవస్థ వల్ల వచ్చిన సమస్యలను ఆ వ్యవస్థను మార్చుకోవడం ద్వారానే శాశ్వతంగా పరిష్కరించుకోగలం.



> పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, సామాజిక రుగ్మతలకు ప్రపంచంలోని అత్యధిక దేశాలు చాలా కాలంగా గుల్ల అవుతున్నాయి. ఈ రోగం ముదిరి సామ్రాజ్యవాద దేశాలకు వ్యాపించింది. తన వరకు వస్తేగాని తత్వం బోధపడదన్నట్లు ఇప్పుడు ఈ దేశాలు గగ్గోలు పెడుతున్నాయి. కొన్ని దశాబ్దాలుగా అనేక దేశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా దోచుకు తిని బలిసిపోయిన సంపన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు చిక్కిశల్యమైపోతున్నాయి. 'మీరు ఒక్కరు - మేము 99 మందిమి" అని అక్కడి యువత నిలదీస్తోంది. కాలేజీల్లో, యూనివర్శిటీల్లో కొత్త గొంతులు గొప్ప ధ్వని చేస్తున్నాయి. రానున్న ఈ మహా ప్రభంజనాన్ని గుర్తించిన ఆ యా దేశాధినేతలు తమ అంబుల పొదిలోని... కోట్ల మంది మరణాలకు కారణమైన మతోన్మాద, జాతి దురహంకార ఆయుధాలకు మరోసారి పదును పెడుతున్నారు.

కాలేజీల్లో, యూనివర్శిటీల్లో కొత్త గొంతులు గొప్ప ధ్వని చేస్తున్నాయి. రానున్న ఈ మహా ప్రభంజనాన్ని గుర్తించిన ఆ యా దేశాధినేతలు తమ అంబుల పొదిలోని...కోట్ల మంది మరణాలకు కారణమైన మతోన్మాద, జాతి దురహంకార ఆయుధాలకు మరోసారి పదును పెడుతున్నారు. మానవ వినాశనానికి సిద్ధపడుతున్నారు.

వలసలకు కారణం ఎవరు?

శ్రమ నైపుణ్యత, యంత్ర పరిజ్ఞానంలో వచ్చిన మార్పుల వల్ల పెరిగిన ఉత్పత్తిని అమ్ముకోవడానికి బ్రిటన్ సరుకులు దేశదేశాలు తిరిగాయి. రాజ్యాధికారం తమకు అండగా వుంటే పెట్టుబడి మరింతగా ఎలా పోగేసుకోవచ్చో అనుభవంలో నేర్చుకున్న కంపెనీల ప్రతినిధులు, దేశాల స్థానిక పాలకులను కుట్రలు, కుతంత్రాల ద్వారా కూలదోసి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు, వలసదేశాలుగా మార్చుకున్నారు. 1870 మధ్య నుండి మొదటి ప్రపంచయుద్ధం (1914-18) నాటికి సంవత్సరానికి సగటున 6,20,000 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణాన్ని అంటే ప్రపంచంలో 85 శాతం భూభాగాన్ని సామ్రాజ్యవాద దేశాలు వలసలుగా మార్చుకున్నాయని ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొ॥ఐజాజ్ అహ్మద్ 20వ శతాబ్దం సంక్షిప్త రాజకీయ చరిత్ర పుస్తకంలో తెలిపారు. ఇంత విశాల భూభాగం నుండి ముడిసరుకులను తమ దేశాలకు ఎగుమతి చేసుకుని, అక్కడ తయారయిన సరుకులను ప్రపంచమంతటా అమ్ముకుంటూ పెట్టుబడిని విశ్వవ్యాపితం చేసుకున్నారు. శ్రమజీవులు లేకుండా పెట్టుబడి అదనంగా ఒక్క పైసా కూడా సృష్టించలేదు. అందుకే వలస దేశాల నుండి బలవంతాన లక్షల మందిని తరలించారు. మన దేశం నుండి ఇలా కార్మికులను కలకత్తా ఓడరేవు నుండి తరలించేందుకు 1842లో 'ఇండియా చట్టం XV' ను బ్రిటన్ ప్రభుత్వం చేసింది. ఆ తర్వాత 1847లో మద్రాసు ఓడరేవు నుండి కూడా కార్మికులను విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. బ్రిటన్ కొత్తగా ఆక్రమించుకున్న ఫిజి దేశాన్ని దోచుకోవడానికి 1900 నుండి పదకొండు సంవత్సరాల్లో 2,684 మంది భారతీయులను పడవలో తరలించినట్లు ప్రముఖ జర్నలిస్టు సంజయ బారు తన తాజా పుస్తకంలో వివరించాడు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి సిలోన్ (శ్రీలంక), బర్మా, మలయ (సింగపూర్), దక్షిణాఫ్రికా, ఉత్తరాఫ్రికా, ఫిజి లాంటి దేశాల్లో ఇలా బలవంతాన తరలించబడిన భారతీయులు వున్నారని ఆయన ఆధారాలతో ప్రకటించారు. దేశాన్ని ఆక్రమించి ఆస్థులను లూటీ చేయడమే కాకుండా, దేశ ప్రజలను వలస కార్మికులుగా మార్చిన బ్రిటన్ నేడు వలసదారుల గురించి మాట్లాడుతున్నది.

లాభమే ముఖ్యం

చేసిన పాపం దండంతో సరి అన్నట్లు దేశదేశాల ప్రజలను బలవంతాన వలస కార్మికులుగా మార్చిన బ్రిటన్ జాతీయ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత పౌరసత్వం సమస్య రావడంతో హింసకు గురవుతారనే భయం ఉన్న ఎవరైనా బ్రిటన్‌లో ఆశ్రయం పొందవచ్చని 1951లో చట్టం చేసింది. అమెరికా 1965లో వలసదారుల చట్టాన్ని సరళీకరించి వృత్తి నిపుణులను పెద్దఎత్తున దిగుమతి చేసుకుంది. జూన్ 2025 వరకు బ్రిటన్‌లో రికార్డు స్థాయిలో 1,11,084 మంది వలసదారులు వున్నారు. 1960 అమెరికా జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జన్మించిన వలసదారులు 12,296 మంది వుంటే 1980 నాటికి 2,06,087 కు, 1990 నాటికి 4,50,406 కు, 2000 సంవత్సరానికి 12,20,552 మంది వున్నారు. వీరంతా ఈ దేశంలో సరైన జీవనోపాధి లేక, ఇక్కడి కంటే అక్కడ మెరుగైన జీవితాన్ని పొందవచ్చని వెళ్లారు. మన లాంటి అనేక దేశాలను శతాబ్దాలుగా ఆక్రమించుకుని మన వెనుకబాటుకు కారణమైన వారే నేడు వలసలు గురించి మాట్లాడుతున్నారు.

తమ దేశంలో వలసదారులు వున్నారని వారు బయటకు పోతే తప్ప తమ దేశం నిజమైన యునైటెడ్ కింగ్‌డమ్ కాలేదని ఇన్నేళ్ల తర్వాత బ్రిటన్‌కు చెందిన టామీ రాబిన్సన్ అనే ఓ జర్నలిస్టుకు గుర్తుకు వచ్చిందట. తమ దేశంలో వున్న వలసదారుల్లో 41,870 చిన్న పడవల్లో అక్రమంగా జొరబడ్డారని ఆయన చెబుతున్నాడు. తమ పరిశ్రమల్లో చౌకగా పనిచేయడానికి అవసరమైనంత కాలం వలసదారుల మాటెత్తని అమెరికా, బ్రిటన్‌లోని ఈ అపర మేధావులు నేడు అక్రమ వలసలు అంటూ అల్లరి చేస్తున్నారు, దానికి మతం రంగు పులుముతున్నారు. ఫాసిస్టు విధానంలో భాగంగా అందరి నుండి కొందరిని వేరు చేసి శత్రువులుగా సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2002 నుండి 2025 మధ్య ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇరాక్ లాంటి దేశాల నుండి బ్రిటన్‌కు వలసలు పెరిగాయంటున్నారు. 2021లో తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత ఆఫ్ఘనిస్తాన్ నుండి వస్తున్న శరణార్థుల సంఖ్య భారీగా పెరిగిందట! అప్పుడు తాలిబన్లకు, ఇప్పుడు ఇజ్రాయిల్‌కు మద్దతు ఇచ్చి లక్షల మందిని దిక్కులేని అనాథలుగా మార్చింది సంపన్న దేశాలే కదా? బ్రిటన్‌లో ఆశ్రయం కోరుతున్న వారిలో 59 శాతం మంది 50 ఏళ్ళలోపు వారు కాగా, 22 శాతం మంది పిల్లలు ఉన్నారు. ఇన్ని సంవత్సరాలుగా వీరి శ్రమను చౌకగా కొల్లగొట్టి, ఇప్పుడు వీరిని 'మురాలు' అంటూ ఆ దేశ ప్రధాన మంత్రి సర్ కీర్ స్టార్మర్ అంటున్నాడు. వలసదారులను రాక్షసులుగా చూపించడానికి పాలకులు వారి అనుకూల మీడియా సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి.

తీవ్రమవుతున్న పెట్టుబడిదారీ సంక్షోభం

ఏ దేశమైనా నిలకడగా అభివృద్ధి చెందాలంటే సగటున కనీసం ఏడు శాతం అభివృద్ధి సాధించాలి. 2024-25 సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 3.2 శాతంగా వుంది. జపాన్, జర్మనీ, ఇంగ్లాండ్ లాంటి దేశాలు కనీసం ఒక్క శాతం అభివృద్ధిలో కూడా లేవు. అగ్ర రాజ్యంగా కీర్తించబడుతున్న అమెరికా ప్రపంచంలోనే అత్యధిక రుణగ్రస్త దేశంగా దిగజారింది. ప్రపంచ సంపదలో 95 శాతం ఒక్క శాతంగా వున్న సంపన్నుల దగ్గర పోగుపడింది. ప్రపంచ జనాభాలో సుమారు 46 శాతం (300 కోట్లు) మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ ఆర్థిక విధానాలను అమలు చేసిన ఫలితంగా 54 దేశాలు రుణ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఇందులో 18 దేశాలు రుణాలు చెల్లించలేని బకాయిదార్లుగా మారాయి. ఇంత వినాశానికి కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇంగ్లాండ్‌లో టామీ రాబిన్సన్, అమెరికాలో చార్లీ కిర్క్ లాంటి వారి ద్వారా అతి తీవ్రవాద జాతీయతత్వాన్ని రెచ్చగొడుతున్నారు. మా దేశం మాదే (మేము-వారు) అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తులు బలపడుతున్నాయి. జర్మనీలో పచ్చి మితవాద గ్రీన్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఫ్రాన్స్‌లో మితవాద పార్టీలు అధికారాన్ని సవాల్ చేస్తున్నాయి. ఐర్లాండ్‌లో భారతీయులపై జరుగుతున్న దాడులకు కూడా ఈ మితవాద శక్తులే కారణం. వలసదారుల గురించి మాట్లాడుతున్న ట్రంప్ (ఈయన తాత జర్మనీకి చెందినవాడు), ఎలాన్ మస్క్ (దక్షిణాఫ్రికా నుండి అమెరికాకు వలస వచ్చాడు)లు కూడా వలసదారులే. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన సంక్షోభం నుండి గట్టెక్కడానికి వలసదారులను, ముఖ్యంగా ముస్లింలను శత్రువులుగా చూపిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా మన దేశంలో ఇలాంటి శక్తులు అధికారంలోకి వచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోగా మత ఉద్రిక్తతలు, మత ఘర్షణలు ఎలా పెంచుతున్నాయో చూస్తున్నాము.

మితవాద శక్తులు ఎక్కడ బలపడినా అది మానవ వినాశానికే దారి తీస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధ కాలం నుండి చరిత్ర చెబుతున్న సత్యం ఇదే. ఆర్థిక వ్యవస్థ వల్ల వచ్చిన సమస్యలను ఆ వ్యవస్థను మార్చుకోవడం ద్వారానే శాశ్వతంగా పరిష్కరించుకోగలం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

డబుల్ ఇంజన్‌తో డబుల్ దగా

వ్యాఖ్య



ఎ. అజ శర్మ

ఇటీవల అనంతపురంలో జరిగిన కూటమి సూపర్ సిక్స్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రెట్టింపు వేగంతో అభివృద్ధిలో దూసుకుపోతోందని చెప్పారు. తాజాగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో కూడా ఇదే విధంగా మాట్లాడి, దీనిలో అధికారులు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి దూకుడు వాస్తవాలు అర్థం కావాలంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో చోటు చేసుకున్న కొన్ని పరిణామాలనైనా పరిశీలించాలి.

రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీల ఎంపీల మద్దతుతోనే కేంద్ర మోడీ ప్రభుత్వం ఆధారపడి ఉందన్నది ఒక రాజకీయ వాస్తవం. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడానికి ఇదొక గొప్ప సదవకాశం. దీన్ని రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం వినియోగించుకుంటోందా లేదా అన్నదే నేడు కీలకాంశం.

రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి, సచివాలయం, అసెంబ్లీ, రాజ్‌భవన్, హైకోర్టు వంటి భవనాల నిర్మాణాలు చేయడం, ఇతర మౌలిక వసతులకు అవసరమైన నిధులు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. కేంద్ర ప్రభుత్వం ఆ పని చేయకుండా 15 వేల కోట్ల రూపాయలు అప్పు ఇప్పించి చేతులు దులిపేసుకుంది. ఇదే గొప్ప విజయం అని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 90లో పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులు, నిర్వాసితుల పునరావాసం, ఇతర రాష్ట్రాల అభ్యంతరాలను కూడా పరిష్కారం చేయవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే నేడు మోడీ ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల పునరావాసం తన బాధ్యత కాదని మడత పేచీ పెట్టింది. దీన్ని కూడా వ్యతిరేకించే స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం లేకపోవడం అత్యంత విచారకరం. వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాలని అదే చట్టం సెక్షన్ 46(3)లో పేర్కొన్నారు. ఆ నిధులూ లేవు, సాధించిన అభివృద్ధి అంతకంటే లేదు.

రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 93 ప్రకారం ఏర్పడవలసిన కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేటికీ కనీస పరిశీలనలో కూడా లేదు. విభజన చట్టం ప్రకారం విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ నిర్మాణాలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలి. ఇవన్నీ పదేళ్ళలో పూర్తి కావాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ గత పదకొండేళ్లుగా మోడీ ప్రభుత్వం వీటిని నిరాకరిస్తూ వచ్చింది. ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ కూడా వాటిని సాధించకుండా విదేశీ సంస్థల నుండి అప్పులు తీసుకొచ్చి మెట్రో రైల్ నిర్మిస్తామని ప్రకటించడం ఏ రకంగా సమంజసం? విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఎప్పుడు వస్తుందో తెలియని రైలు ప్రయాణంలా ఉంది. పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధాన మంత్రి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని....చట్టంలో లేదని ఎగనామం పెట్టి, చట్టంలో స్పష్టంగా ఉన్న వీటన్నింటినీ నిస్సిగ్గుగా ఎగ్గొట్టి, నేడు తామేదో చేసేస్తున్నట్లు నమ్మబలకడం పచ్చి దగా తప్ప మరొకటి కాదు.



> చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తిగా కేంద్ర నరేంద్ర మోడీ కనుసన్నలలోనే పాలన సాగిస్తోంది. తమపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉందనే చక్కటి అవకాశాన్ని కూడా తెలుగుదేశం ప్రభుత్వం కనీసంగా కూడా వినియోగించుకోవడం లేదు. కారణమేమిటో వారికే తెలియాలి. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను కూడా సాధించుకోకుండా, ఢిల్లీ చుట్టూ తిరుగుతూ, నరేంద్ర మోడీని ప్రసన్నం చేసుకోవడానికి కూటమి నాయకులు పోటీ పడుతున్నారు. ఈ డబుల్ ఇంజన్ రివర్సు స్పీడును ఎంత తగ్గించగలిగితే రాష్ట్ర ప్రయోజనాలకు అంత మంచిది.

ఈ ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్ర అప్పులు పెంచడం తప్ప, కేంద్రం నుండి ఏం సాధించిందో వారే చెప్పాలి. చట్ట ప్రకారం హక్కుగా రావలసిన వాటిని కూడా ఎందుకు వదిలేశారో కూడా చెప్పాలి. ఇవేవీ మాట్లాడకుండా ఏదో చేసేశామని ప్రగల్భాలు పలకడమంటే పోలవరం నిర్వాసితులతో పాటు రాష్ట్ర ప్రజలందరినీ నిలువునా ముంచేయడమే.

ఈ విధంగా రాష్ట్రానికి డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఒరిగిందేమీ లేదు సరికదా మరిన్ని దగాలే జరిగాయి. డబుల్ ఇంజన్‌తో రాష్ట్రం ముందుకు పయనించడం కాదు కదా, రెట్టింపు వేగంతో వెనక్కు నడుస్తోంది. దీన్ని ఏమని పిలవాలి? డబుల్ ద్రోహం అని కాకుండా!

ఇవన్నీ ఒక ఎత్తయితే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరో ఎత్తు. కొత్తగా దీని బలోపేతానికి డబుల్ ఇంజన్ చేసిందేమీ లేదు సరికదా పూర్తిగా కష్టాల్లోనికి నెట్టేస్తోంది. ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడి తీరతామని చంద్రబాబుతో సహా తెలుగుదేశం నాయకులు అనేక మంది వాగ్దానాలు చేశారు. ఎన్నికల తరువాత కూడా విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే విశాఖ స్టీల్‌ను కాపాడలేకపోతే తాము తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు.

గత ఏడాదిన్నర కాలంగా మోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను అన్ని రకాలుగా బలహీనపరుస్తోంది. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ చేసిన ఏకగ్రీవ తీర్మానానికి కూడా విలువ ఇవ్వలేదు. స్వంత గనులు ఇవ్వడానికి నిరాకరిస్తోంది. ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి వేశారు. ఐదు వేలమంది కాంట్రాక్ట్ కార్మికులను, రెండువేల మంది పెర్మనెంట్ ఉద్యోగులను తీసివేశారు. సిబ్బందికి ఏడాది కాలంగా పూర్తి జీతాలు కూడా ఇవ్వడం లేదు. ప్లాంట్‌లోని కీలక విభాగాలను 44 ముక్కలుగా చేసి, పూర్తిగా ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇచ్చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ పేరున (ఇఒఐ) టెండర్లు పిలిచారు. ఇదేగాని జరిగితే ప్రహారీ గోడకు పైన ప్రభుత్వ రంగ సంస్థ అనే ఒక బోర్డు తప్ప, ఇక మిగిలినవన్నీ ప్రైవేట్ అయినట్లే.

ఇది చాలదన్నట్లు చంద్రబాబు ప్రభుత్వం దీనికి అతి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు అన్ని సదుపాయాలను కలగజేస్తోంది. భూములు కేటాయించింది. దీనికి అనుబంధంగా పోర్టు నిర్మాణానికి పూనుకుంది. దీనికి ఇనుప గనులు కేటాయించమని స్వయంగా ముఖ్యమంత్రే ప్రధానిని విశాఖ సభ వేదికగా కోరింది. వీరి ఎంపీల బృందం కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలిసి మిట్టల్ స్టీల్ ప్లాంటుకు గనులు కేటాయించమని కోరింది. ఇవన్నీ గమనిస్తుంటే ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్‌ను డబుల్ ఇంజన్ సర్కార్ ముంచేయడానికి కాకపోతే, ఇక దేనికి వుందన్న సందేహం సామాన్యులకు సైతం కలగక మానదు. అయినా ఏదో ప్యాకేజీ ఇచ్చేశామని అడ్డంగా బుకాయించడం వీరికే చెల్లింది.

వీటన్నిటికీ మించిన అత్యంత అప్రజాస్వామిక, దుర్మార్గ చర్య మరొకటి ఉంది. గత నాలుగు సంవత్సరాలకు పైగా స్టీల్ ప్లాంట్ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ప్రభుత్వం నిస్సిగ్గుగా కూల్చివేసింది. తిరిగి దీన్ని వేసుకోవడానికి కూడా పోలీసులు అనుమతించలేదు. అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వాటిని కూడా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు. ఇంకా, ఇటీవల స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి పాల్గొనాల్సిన బహిరంగ సభను గాజువాకలో నిర్వహించడానికి అనుమతిని కూడా ప్రభుత్వం అప్రజాస్వామికంగా నిరాకరించింది. చివరకు అఖిల భారత స్థాయి నాయకుడు ఎటువంటి వేదిక లేకుండా ఒక వాహనం నుంచి ప్రసంగించవలసి వచ్చింది. ఇది రాష్ట్రానికే అవమానకరం. నేటి రాష్ట్ర పరిస్థితులకు ఇది దర్పణంలా నిలుస్తోంది.

తమ ఏడాది పాలనలో అంత చేసేశాం, ఇంత చేసేశాం, హామీలన్నీ అమలు చేసేశాం అని చంద్రబాబు ప్రభుత్వం ఎంత గొప్పలు చెప్పుకున్నా, రాష్ట్ర ప్రజలు మాత్రం వాస్తవాలను గమనిస్తూనే ఉన్నారు. ఒక విషయం మాత్రం స్పష్టం. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వస్తాయి, రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుంది. యువతకు మంచి ఉపాధి లభిస్తుంది అన్న భ్రమలు ఎవరికైనా ఉన్నా, వాటన్నిటిని ఈ డబుల్ ఇంజన్ సర్కార్ పటాపంచలు చేసేసింది. ఉన్న ఉపాధినే ఊడగొడుతోంది. చంద్రబాబు కూటమి ప్రభుత్వం పూర్తిగా నరేంద్ర మోడీ కనుసన్నలలోనే పాలన సాగిస్తోంది. తమపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉందనే చక్కటి అవకాశాన్ని కూడా తెలుగుదేశం ప్రభుత్వం కనీసంగా కూడా వినియోగించుకోవడం లేదు. కారణమేమిటో వారికే తెలియాలి. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను కూడా సాధించుకోకుండా, ఢిల్లీ చుట్టూ తిరుగుతూ, నరేంద్ర మోడీని ప్రసన్నం చేసుకోవడానికి కూటమి నాయకులు పోటీ పడుతున్నారు. ఈ డబుల్ ఇంజన్ రివర్సు స్పీడును ఎంత తగ్గించగలిగితే రాష్ట్ర ప్రయోజనాలకు అంత మంచిది.

/ వ్యాసకర్త ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి /

కవిత్వం

గిరిజనులు జనగిరులూ!

కదలినారు గిరిజనులు
కదలినాయి జనగిరులు
కొండ కోన కొల్లగొట్టె
కార్పొరేట్ల గుండెలదర
కుట్ర దారు కూటములు
పొగరు కళ్ల నిదుర చెదర
కదలినారు గిరిజనులు
కదలినాయి జనగిరులు!
కొండ రెడ్డి, మూగిరెడ్డి
మూక దొర, మన్నె దొర
కోదు, గదబ, వాల్మీకి
పరజా, జాతాపు దొర
కుటియా, భగత, సవర
పోడు బతుకు మంటలవిగో
కదిలినారు గిరిజనులు
కదలినాయి జనగిరులు
ఎవడు విత్తనాలు జల్లి
పెంచినాడు ఈ అడవులు?
ఎవడు పోసినాడు నీరు
ఎవడు తీసినాడు నీరు?
ఎవడు తవ్వినాడు గొప్పు?
దమ్మంటే, ఇపుడు చెప్పు!
కదలినారు గిరిజనులు
కదలినాయి జనగిరులు
అడవి కళ్ళు చెమ్మగిలితే
అదే ఊట, అదే ధార!
పచ్చి కొండ గర్భంలో
పిండం గదా జలపాతం!
అందరి ఆస్తులు గెడ్డలు
కొందరికెలగిస్తారు?
కదిలినారు గిరిజనులు
కదలినాయి జనగిరులు
దిగువ బాబు.. ఎగువ మోడీ
మధ్యలోన పవన్ జోడి!
నోట్ల కట్ట జేబులెడితే
నోట మాట రానోళ్లా!?
ఏమో.. ఏమైనా.. మేము
నిలదీస్తాం..ఎదిరిస్తాం
తెల్లోడిని ఎదిరించిన
అల్లూరి వారసులం.

- నల్లి ధర్మారావు, 7660967313

(అల్లూరి, మన్యం జిల్లాల్లో జరుగుతున్న హైడ్రో విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలకు వ్యతిరేకంగా గిరిజనులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా)

పెట్టుబడిదారులకు సహకరించేందుకు
కార్మిక చట్టాల సవరణ

- ఎపి-యుకె బిజినెస్ ఫోరం రోడ్‌షోలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పెట్టుబడిదారులకు సహకరించేందుకు తాము వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. లండన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్, పాల్‌మాల్ కన్వెన్షన్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం-యుకె బిజినెస్ ఫోరం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షల్ అస్నాని సంధానకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మిక సంస్కరణలు, ల్యాండ్ కన్వర్షన్, నాలా ట్యాక్స్ వంటివి సవరించాలని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సూచించగా, తాము 45 రోజుల్లోనే వాటిని పూర్తిచేశామని తెలిపారు. పరిశ్రమల స్థాపనలో ప్రతిబంధకంగా ఉన్న కొన్ని నిబంధనలను సవరిస్తున్నామన్నారు. ఐదుగురు ప్రభుత్వ కార్యదర్శులతో సలహామండలిని ఏర్పాటు చేశామని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నామని తెలిపారు. గత 15 నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి సాధించడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని చెప్పారు. సుస్థిరమైన నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఉత్సాహవంతంగా పనిచేసే కొత్తతరం యువ నాయకత్వం ఉందన్నారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను తెచ్చి, యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. దక్షిణాసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతోందన్నారు. ముంబయి కంటే రెట్టింపు సామర్థ్యం తో 1.5 గిగావాట్ల డేటా సెంటర్స్ విశాఖకు రాబోతున్నాయని తెలిపారు.


లండన్‌లో ఎపి ప్రభుత్వం-యుకె బిజినెస్ ఫోరం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి లోకేష్

సగానికి పైగా ఓటర్లకు 'ఆ' అవసరం ఉండదు
దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌పై ఇసి అధికారుల అంచనా

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా త్వరలో జరిగే ఎస్ఐఆర్ ప్రక్రియలో అనేక రాష్ట్రాల్లోని సగానికి పైగా ఓటర్లు తమ గుర్తింపు కోసం ఎలాంటి పత్రాలను సమర్పించాల్సిన అవసరం ఉండకపోవచ్చునని ఎన్నికల కమిషన్ అధికారులు బుధవారం తెలిపారు. ఈ ఓటర్లు తమ రాష్ట్రాల్లో జరిగిన చివరి ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో స్థానం దక్కించుకోవడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. అనేక రాష్ట్రాల్లో 2002 నుంచి 2004 మధ్యనే చివరిగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించారని అధికారులు గుర్తు చేశారు. త్వరలో దేశవ్యాప్తంగా జరిగే ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ ఏడాదులనే కటాఫ్ తేదీ నిర్ణయిస్తారని భావిస్తున్నారు. అయితే దేశవ్యాప్త ఎస్ఐఆర్‌కు కటాఫ్ తేదీని, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించాలనే విషయంపై ఇసి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే ఆయా రాష్ట్రాల్లో చివరి సారిగా ఎస్ఐఆర్ ప్రక్రియ తరువాత ప్రచురించబడిన వారి రాష్ట్రాల ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారులకు ఇసి ఇప్పటికే స్పష్టం చేసింది.

గాజాపై దాడులు ఉధృతం

- దజన్ల సంఖ్యలో మరణాలు నమోదు
- ఇప్పటివరకు 65వేల మంది పాలస్తీనియన్ల మృతి
- యెమెన్ పోర్టుపై దాడులు

గాజా : అంతర్జాతీయంగా ఎన్ని విమర్శలు, ఖండనలు వస్తున్నా వాటిని బేఖాతరు చేస్తూ ఇజ్రాయిల్ గాజా వ్యాప్తంగా పూర్తి స్థాయి భూతల దాడులను ఉధృతం చేసింది. గాజా నగరంపై బాంబుల వర్షం కురుస్తోందని, అడ్డూ అదుపు లేకుండా పేలుళ్ళు కొనసాగుతునే వున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడులతో గాజాలో బుధవారం ఉదయం నుండి దజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారు. అలాగే, గాజాను ప్రజలు తక్షణమే వదలి దక్షిణ ప్రాంతానికి తరలివెళ్లిపోవాలని ఇజ్రాయిల్ సైన్యం ఆదేశాలు జారీ చేయడంతో వందలు వేల సంఖ్యలో ప్రజలు మూటా ముల్లె సద్దుకుని పిల్లలు, వృద్ధులను తీసుకుని ప్రాణాలు అరచేతిలో పట్టుకుని వెళుతున్నారు. ఇజ్రాయిల్ సైన్యం పెద్ద ఎత్తున సాగుతున్న ఈ దాడుల్లో ట్యాంకులు, జెట్ విమానాలతో పాటూ నావికాదళ బోట్లు కూడా పాల్గొంటున్నాయి. దాదాపు రెండేళ్ళుగా సాగుతున్న ఈ దాడుల్లో 65,062మంది పాలస్తీనియన్లు మరణించగా, 1,65,697మంది గాయపడ్డారు. ఇంకా వేలాదిమంది ప్రజలు శిధిలాల కుప్పల కింద పడి నలిగిపోయారు.

అక్రమ నిర్బంధాల కొనసాగింపు

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో వందలాదిమంది ప్రజలను అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటున్నారని హమాస్ సీనియర్ అధికారి అబ్దుల్ రహమాన్ షాదిద్ విమర్శించారు. ఎలాంటి విచారణలు లేదా అభియోగాల నమోదు లేకుండా వారి నిర్బంధాన్ని ఎప్పటికప్పుడు పొడిగించాలనే ఒక విధానంలో భాగంగానే వారినందరినీ ఖైదీలుగా అదుపులోకి తీసుకున్నారని విమర్శించారు. ఇది అన్ని విధాలా మానవతా ప్రమాణాలను, అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. పాలస్తీనియన్ల జాతిని మొత్తంగా అణిచివేసి, వారి స్వేచ్ఛను హరించాలన్నదే ఇజ్రాయిల్ లక్ష్యమని, అందులో భాగంగానే ఈ సామూహిక శిక్ష విధింపు అని దానికోసమే ఈ పాలనాపరమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నారని షాదిద్ విమర్శించారు. ఇజ్రాయిల్ జైళ్ళలో 3577మందికి పైగా పాలనాపరమైన ఖైదీలుగా మగ్గుతున్నారు.

బాసటగా వుంటాం

అణచివేతకు గురవుతున్న ప్రజలకు బాసటగా నిలబడకుండా తమను ఎవరూ ఆపలేరని టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్ రెసెప్ తైయిప్ వ్యాఖ్యానించారు. గాజాలో పాలస్తీనియన్లకు సంఘీభావాన్ని ప్రకటించారు. పశ్చిమాసియాలో రక్తపుటేరులు పారించాలనుకునే వారిని ఎదిరించి, చివరికంటా తాము దన్నుగా నిలబడతామని హామీ ఇచ్చారు.

యెమెన్ పోర్ట్‌పై ఇజ్రాయిల్ దాడులు

యెమెన్‌పై ఇజ్రాయిల్ విరుచుకు పడింది. హొడెడాపై వైమానిక దాడులు చేపట్టింది. హొడెడా ఓడరేవు వద్ద హౌతీలు వినియోగించే " సైనిక మౌలిక సదుపాయాలను" ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్, దాని మిత్రదేశాలపై దాడులు చేయడానికి, ఇరాన్ ప్రభుత్వం పంపిణీ చేసిన ఆయుధాలను హౌతీలకు అందచేయడానికి హొడెడా ఓడరేవును వినియోగిస్తున్నారని ఆ ప్రకటన పేర్కొంది.

సూపర్-4కు పాకిస్తాన్
యుఎఇపై 41పరుగుల తేడాతో గెలుపు

దుబాయ్: ఆసియాకప్ సూపర్-4లోకి పాకిస్తాన్ జట్టు ప్రవేశించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 146 పరుగులు చేయగా.. ఛేదనలో భాగంగా యుఎఇ జట్టు 17.4ఓవర్లలో 105పరుగులకే ఆలౌటైంది. పాకిస్తాన్ బౌలర్లు షాహిన్ షా అఫ్రిది, రవూఫ్, ఆబ్రార్ అహ్మద్‌కు రెండేసి, ఆయుబ్, అఘా సల్మాకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు ఫకర్ జమాన్(50) అర్ధసెంచరీకి తోడు షాహిన్ అఫ్రిది(29నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో గౌరవప్రద స్కోర్ చేసింది. దీంతో గ్రూప్-ఎలో పాకిస్తాన్ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసుకొని సూపర్-4కు క్వాలిఫై అయ్యింది.

చిలికి.. చిలికి.. గాలివాన
షేక్‌హ్యాండ్ వివాదం



ఆసియాకప్‌లో ఇండియా, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తలెత్తిన షేక్‌హ్యాండ్ వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. ఆ మ్యాచ్‌కు ఐసిసి రిఫరీగా ఉన్న ఆండీ పైక్రాఫ్ట్(జింబాబ్వే)ను తప్పించాలని, అతని స్థానంలో రిచీ రిచర్డ్సన్(వెస్టిండీస్)ను నియమించాలని పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) ప్రతిపాదించింది. ఆ నిర్ణయాన్ని ఐసిసి త్రోసిపుచ్చడంతో ఆసియాకప్ టోర్నీని బాయ్‌కాట్ చేస్తామంటూ ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిసి)కి లేఖలు రాసింది. అలాచేస్తే ఎదురయ్యే పరిణామాలను బేరీజు వేసుకున్న పిసిబి చివరికి ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గింది. అసలే తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న పిసిబిపై రాబోయే రోజుల్లో ఐసిసి ఎలాంటి ఆంక్షలు విధిస్తుందోనని వెనక్కి తగ్గినట్లుంది. ఈ పరిణామాలన్నీ బుధవారం ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)తో మ్యాచ్‌కు ముందు జరిగింది.. అసలు ఇదంతా ఎందుకు..? యుఎఇ చేతిలో ఓడితే ముందే సర్దేసుకోవచ్చు కదా! అని మరో ఆలోచన...

అసలేం జరిగిందంటే..

భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ ముగిసిన తర్వాత భారత ఆటగాళ్లు పాకిస్తాన్ ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా మైదానాన్ని వీడారు. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం అంటూ తొలుత పిసిబి ఐసిసికి ఫిర్యాదు చేసింది. మ్యాచ్ ముగిసాక తప్పనిసరిగా ఆటగాళ్ల ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వాలని నిబంధన ఎక్కడా లేదు. అది ఆటగాళ్ల ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. అదే టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బృందం కూడా చేసింది. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చే నడిచింది. ఆ తర్వాత మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను తొలగించాలంటూ పిసిబి పేర్కొనడం.. అలా చేయడం కుదరదని ఐసిసి తేల్చిచెప్పడం చక చకా జరిగిపోయాయి. ఈ క్రమంలో యుఎఇతో బుధవారం జరగాల్సిన మ్యాచ్‌కు ముందు పాకిస్తాన్ ఆటగాళ్ల సమయానికి మైదానానికి చేరుకోలేదు. హోటల్ గదులకే పరిమితమయ్యారు. దీంతో పాకిస్తాన్ జట్టు ఆసియాకప్‌ను బహిష్కరించింది అంటూ పుకార్లు వెల్లువడ్డాయి. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ.. ప్రయాణ ఆలస్యమే కారణం అంటూ టోర్నీ నిర్వాహకులు చివరి తేల్చి చెప్పారు. దీంతో ఒక గంట ఆలస్యంగా అంటే పాకిస్తాన్-యుఎఇ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది.

- స్పోర్ట్స్ డెస్క్

సిట్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి : మద్యం కేసు నిందితులు బాలాజీ గోవిందప్ప, కాల్వ ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి ఎసిబి కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడాన్ని రద్దు చేయాలంటూ సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదించారు. సిట్ ఛార్జిషీట్‌లో లోపాలను లేవనెత్తుతూ ఎసిబి కోర్టు ఆఫీసు మెమోరాండం ఇచ్చిందన్నారు. ఇది చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. ఎసిబి కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిట్ వేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులిచ్చారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. **శ్రీమతి ఉదత్తు వెంకట పద్మ కమల కుమారి, భర్త : యు వి ఎల్ నాంచారయ్య,** డి నెం.23-25-1, సన్నిధానంవారి వీధి, పోలీస్ స్టేషన్ దగ్గర, సత్యనారాయణపురం, విజయవాడ-520011.
2. **శ్రీ ఉదత్తు వెంకట లక్ష్మీనాంచారయ్య, తండ్రి : సాంబశివరావు,** డి.నెం.7-530, గొడుగుపేట, మచిలీపట్నం జిల్లా, మచిలీపట్నం, కృష్ణా-521001.
3. **శ్రీ ఉదత్తు విశ్వనాథ్ వెంకటేష్, తండ్రి : యు వి ఎల్ నాంచారయ్య,** 23-25-1, సన్నిధానం వారి వీధి, సత్యనారాయణపురం, విజయవాడ, కృష్ణా జిల్లా, విజయవాడ-520011.
4. **శ్రీమతి ఉదత్తు వెంకట పద్మ కమల కుమారి, భర్త : యు వి ఎల్ నాంచారయ్య,** శ్రీ వెంకట పద్మావతి నిలయం, రెండవ అంతస్తు, ఫ్లాట్ నెం.308, సమీప డోర్ నెం.4-46, శివారు గండిగుంట గ్రామ పంచాయతీ, ఉయ్యూరు-521165.

డియర్ సర్ / మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విజయవాడ భారతీనగర్ బ్రాంచ్ నుండి శ్రీమతి ఉదత్తు వెంకట పద్మ కమల కుమారి, శ్రీ ఉదత్తు వెంకట లక్ష్మీనాంచారయ్య మరియు శ్రీ ఉదత్తు విశ్వనాథ్ వెంకటేష్ పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేదీ	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు (2% పీనల్ వడ్డీతో కలిపి) (సం॥కి)
హోమ్ లోన్ అకౌంట్ నెం. 160001733126	రూ. 34,40,000/- తేది. 21.07.2023	రూ. 33,51,083/-	10.00%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 06.09.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.33,51,083/- (అక్షరాల ముప్పై మూడు లక్షల యాభై ఒక్క వేల ఎనభై మూడు రూపాయలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఎ-షెడ్యూల్ : కృష్ణా జిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్, ఉయ్యూరు మండలం, ఉయ్యూరు శివారు గండిగుంట గ్రామ పంచాయితీ, ఉయ్యూరు, ఆర్.ఎస్ నెం.814/2, సమీప డోర్ నెం.4-46 నందు విస్తీర్ణం 2516.4 చ॥గ॥లులోని స్థలం. **హద్దులు : తూర్పు :** దండమూడి పూర్ణ చంద్ర రావు మరియు వల్లభనేని రామకృష్ణ ప్రసాద్ గార్ల ఆస్తి, **దక్షిణం :** కె. గోపాలరావు గారి ఆస్తి, **పడమర :** పంచాయితీ రోడ్డు, **ఉత్తరం :** వల్లభనేని రామకృష్ణ ప్రసాద్ గారి ఆస్తి.

ఈ నాలుగు హద్దుల యందు విస్తీర్ణం 2516.4 చ॥గ॥లు లేదా 2104.03 చ॥మీ॥లు స్థలంలోని 1/36 అవిభాజ్యమైన ఉమ్మడి వాటా 48.89 చ॥గ॥లు లేదా 40.87 చ॥మీ॥లులోని స్థలం.

బి-షెడ్యూల్ : పై ఎ-షెడ్యూల్ నందు మొత్తం స్థలంలోని నిర్మించబడిన శ్రీ వెంకట పద్మావతి నిలయం అను పేరు మరియు స్టైల్‌తో ఉన్న అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.308 (డబుల్ బెడ్‌రూమ్). **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కారిడార్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

ఈ నాలుగు హద్దుల యందు ఫ్లాట్ యొక్క ఫ్లింత్ ఏరియా 874 చ॥అ॥లు, కామన్ ఏరియా 190 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 115 చ॥అ॥లు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులతో కలదు.

టైటిల్ హోల్డర్ : శ్రీమతి ఉదత్తు వెంకట పద్మ కమల కుమారి, భర్త : యు వి ఎల్ నాంచారయ్య

తేది: 09.09.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్



ఈక్వెడార్ రాజధాని క్విటోలో నిరసనల దృశ్యం

డీజిల్ సబ్సిడీ రద్దుకు వ్యతిరేకంగా

ఈక్వెడార్‌లో నిరసన జ్వాల

- **అత్యవసర పరిస్థితి విధించిన అధ్యక్షుడు**

క్విటో : డీజిల్ సబ్సిడీని రద్దు చేస్తూ ఈక్వెడార్ అధ్యక్షుడు డేనియల్ నోబోవాస్ తీసుకున్న నిర్ణయంతో ఆ దేశం భగ్గుమంటోంది. దీనికి వ్యతిరేకంగా వందలాది మంది యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. ఈక్వెడార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జీవన వ్యయం విపరీతంగా పెరుగుతుందని వారు విమర్శించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి పదవి నుంచి డేనియల్‌ను తప్పించాలని వారు పిలుపునిచ్చారు. దీంతో అధ్యక్షుడు డేనియల్ నొబోవా అంతర్గత అశాంతి తీవ్రం అవుతుందనే పేరుతో ఏడు ప్రావిన్స్‌లో 60 రోజులపాటు అత్యవసర పరిస్థితిని బుదవారం ప్రకటించారు. అయితే అధ్యక్షుడు డేనియల్ నొబోవా అధికారం చేపట్టిననాటి నుండి ఉదారవాద విదానాలను అవలంబిస్తున్నారు. దేశ ఆర్థిక పరిస్థితి రిత్యా ఇంధన రాయితీని రద్దు చేస్తున్నామని తద్వారా ప్రభుత్వానికి రూ॥110 కోట్లు ఆదా అవుతుందని, వీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తామని గత వారం ప్రకటించారు. దీంతో డీజిల్ ధరలు గ్యాలన్‌కు రూ॥ 158.54 నుండి రూ॥ 246.68కు పెరిగిపోయింది.

ఈ నేపథ్యంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఈక్వెడార్ నుంచి ఈ ఆందోళన ప్రారంభమై.. ఈక్వెడార్ రాజధాని క్విటో నగర వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా 'నోబోవా అవుట్' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అధ్యక్ష భవనం కరోన్‌డెలెట్ ప్యాలెస్‌ను చుట్టుముట్టాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. మార్గ మధ్యలోనే పోలీసులు వారి ఆందోళనలను చెదరగొట్టారు. పోలీసులు, మిలిటరీ దళాలు వీధుల్లో బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. అయినప్పటికీ నిరసనకారులు వెనక్కి తగ్గకుండా.. పోలీసులపై రాళ్లు రువ్వారు. దీంతో వారిపై పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు.

లండన్‌లో ట్రంప్ పర్యటన

- **ఘనంగా ఆతిథ్యమిచ్చిన రాజు చార్లెస్**
- **ప్రధానంగా వాణిజ్య ఒప్పందంపైనే దృష్టి**

విండ్సర్, ఇంగ్లండ్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రిటన్‌లో అధికార పర్యటన నిమిత్తం బుధవారం లండన్ చేరుకున్నారు. బ్రిటన్‌లో ట్రంప్ పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా ట్రంప్‌నకు రాజు చార్లెస్ దంపతులు ఆతిథ్యాన్ని ఇస్తున్నారు. ఈ సందర్భంగా చార్లెస్ దంపతులతో పాటూ ప్రిన్స్ విలియం, ఆయన సతీమణి కేట్‌లతో కూడా ట్రంప్ భేటీ అయ్యారు. వెయ్యి ఏళ్ళకు పైగా బ్రిటన్ రాజకుటుంబాలకు నెలవుగా వున్న విండ్సర్ కోటలోనే ట్రంప్ బస చేస్తున్నారు. అంతకుముందు ట్రంప్‌కు కోటలో ఘనంగా రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. తుపాకులతో గౌరవవందనాలు, మిలటరీ కవాతు అనంతరం విలాసవంతమైన విందు ఏర్పాటు చేశారు. బ్రిటన్ సహా పలు కీలకమైన వాణిజ్య భాగస్వాములతో అమెరికా వాణిజ్య చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతోంది. ఈ పర్యటనలో సాంకేతికత, పౌర అణు ఒప్పందం సహా ఇరు దేశాల మధ్య అనేక ఒప్పందాలు జరగనున్నాయి.

నిరసనల సెగ : ట్రంప్‌కు బ్రిటన్‌లో నిరసనల సెగ తప్పడం లేదు. ట్రంప్ పర్యటనను నిరాకరిస్తూ మంగళవారం విండ్సర్ కోట వెలుపల స్టాప్ ట్రంప్ కొయిలేషన్‌కి చెందిన నిరసనకారులు ఆందోళన చేపట్టారు. కోట భవనాల్లో ఒకదానిపై ట్రంప్, లైంగిక వేధింపుల నేరస్తుడు జెఫ్రీ ఎపిస్టెన్‌లు కలిసి వున్న ఫోటోను ప్రదర్శించారు. ఆ సమయానికి ట్రంప్ అక్కడకు రాలేదు. దాంతో అధికారులు వెంటనే స్పందించి ఆ వీడియోను, ఫోటోలను తొలగించారు. ఈ సందర్భంగా నలుగురిని అరెస్టు చేశారు. లండన్‌లో బుధవారం పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. వాటిని అదుపు చేసేందుకు దాదాపు 1600మంది పోలీసు అధికారులను రంగంలోకి దించారు. ఇటీవల కాలంలో విచ్ఛిన్నకర, మితవాద రాజకీయాలను రెచ్చగొడుతున్న నేత ట్రంప్ అని ఆందోళనకారులు విమర్శించారు.

- ఎన్‌టిఆర్ జిల్లా, మచిలీపట్నం, గొడుగుపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ భూమి 35 ఎకరాల్లో 'విజయవాడ ఉత్సవ్' పేరుతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ నిర్వహించతలపెట్టిన ఎగ్జిబిషన్ నిర్వహణకు డివిజన్ బెంచ్ అనుమతినిచ్చింది. ఆలయ వ్యవసాయ భూమిలో ఉత్సవ్ పేరిట ఎగ్జిబిషన్ నిర్వహించరాదని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. ఎగ్జిబిషన్ కేవలం 56 రోజులే కనుక అనుమతినిస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. ఆలయ భూమిని శాశ్వత ప్రాతిపదికన ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు అనుమతి ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ ఈ ఏడాది జులై 22న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి ఎదుట ఉంచారు. దీనిని మచిలీపట్నానికి చెందిన బూరగడ్డ సుజయ్ కుమార్ మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం సింగిల్ జడ్జి స్టే విధించడంతో ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసి స్టే ఉత్తర్వులు పొందింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారం నెం.VI (ఎ)

Ref: B1/82/2025 **ది.17-09-2025**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, వీరంపాలెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వర రామచంద్రపురం మండలం, కొప్పల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పున:స్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్టు ఆఫీసర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది. చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పున:స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం. 42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు. ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలక్టరు /ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు | మండలం: జీలుగుమిల్లి | గ్రామం: వీరంపాలెం

వరుస సంఖ్య	సర్వే నెంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు(తండ్రి / భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	6-2A	జి.డి.	1.38	1.38	దాసరి ఉమా శంకరరావు	Dasari Satya Narayana Land	Dasari Srinivas Rao Land	Thandri Satya Narayana	Dasari Basavayya	--
2	10-1	జి.డి.	2.42	2.42	దాసరి బసవయ్య	Dasari Satya Narayana Land	Kovvasi Ramesh Land	Dasari Prasanth Land	Midiyam Gangulu Land	--
3	10-2	జి.డి.	3.72	3.72	దాసరి బసవయ్య	Dasari Satya Narayana Land	Kovvasi Ramesh Land	Dasari Prasanth Land	Midiyam Gangulu Land	--
4	9-2	జి.డి.	1.92	1.92	దాసరి బసవయ్య	Dasari Satya Narayana Land	Thandra Narayana Land	AWD Land	Dasari Basa vayya Land	--
5	14-4B1	జి.డి.	1.50	1.50	దాసరి బసవయ్య	Dasari Basa vayya Cheruvu	Dasari Satya Narayana Land	Dasari Srinivas Rao Land	Badiga Jahn shi rani Land	--
6	6-2A	జి.డి.	1.74	1.74	దాసరి బసవయ్య	Thota Surya Pavani Land	Dasari Basa vayya Cheruvu	Dasari Pallavi Land	Dasari Satyan arayana Land	తాడి-1
7	6-2B	జి.డి.	0.80	0.80	దాసరి బసవయ్య	Thota Surya Pavani Land	Dasari Basa vayya Cheruvu	Mallareddy Vara prasad Land	Dasari Pallavi Land	--
8	12-1	జి.డి.	0.12	0.12	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basa vayya Cheruvu	Dasari Prasanth Land	Dasari Srini vasa Rao Land	Baadiga Jhansirani Land	వేప-1, తాడి-1
9	12-2	జి.డి.	0.46	0.46	బాడిగ ఝాన్సీరాణి					
10	13	జి.డి.	0.24	0.24	బాడిగ ఝాన్సీరాణి					
11	14-2	జి.డి.	3.31	3.31	బాడిగ ఝాన్సీరాణి	Thaati Paramesh Land	Dasari Satya narayana Land	Baadiga Jhansi Rani Land	Dasari Basavayya	--
12	14-4A	జి.డి.	3.42	3.42	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basa vayya Cheruvu	Dasari Satya narayana Land	Dasari Srinivas Rao Land	Baadiga Jhan sirani Land	టేకు-15
13	14-4B1	జి.డి.	1.85	1.85	బాడిగ ఝాన్సీరాణి	Dasari Basa vayya Cheruvu	Baadiga Jhan si Rani Land	Dasari Srinivas Rao Land	Dasari Satya narayana Land	--
14	6-1A	జి.డి.	0.88	0.88	దాసరి శ్రీనివాసరావు	Dasari Prasanth Land	Thandri Nage swararao Land	Mallareddy Varaprasad Land	Korri Venkappa Land	--
15	14-4B2	జి.డి.	0.50	0.50	తోట సూర్య పావనికుమారి	Thaati Lax manudu Land	Kovvasi Ramesh Land	Dasari Basavayya Land	Paida Ven katarao Land	--
16	7-1A	జి.డి.	1.26	1.26	తోట సూర్య పావనికుమారి	Dasari Srini vasarao Land	Dasari Pallavi Land	Dasari Satya narayana Land	Dasari Prasanth Land	పామాయిల్-12, ఫెన్సింగ్
17	7-1B	జి.డి.	0.83	0.83						
18	14-1	జి.డి.	1.34	1.34	దాసరి సత్యనారాయణ	Badiga Jhan si Rani Land	Dasari Basa vayya Land	Dasari Prasanth Land	Kovvasi Ramesh Land	మద్రి-1
19	9-1	జి.డి.	1.92	1.92	దాసరి శ్రీనివాసరావు	Dasari Satya Narayana Land	Thandri Nage swarao Land	AWD Land	Dasari Basavayya	--
20	6-1B	జి.డి.	0.83	0.83	దాసరి పల్లవి	Dasari Satya Narayana Land	Dasari Srini vas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	--
21	6-2B	జి.డి.	1.00	1.00	దాసరి పల్లవి	Dasari Satya Narayana Land	Dasari Srini vas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	--
22	7-3	జి.డి.	0.26	0.26	దాసరి పల్లవి	Dasari Satya Narayana Land	Dasari Srini vas Rao Land	Thandri Satyanarayana	Dasari Basavayya	--
			31.70	31.70						

సం/- **డి.చంద్రశేఖర్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

IKF FINANCE **ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్**
హెడ్ ఆఫీసు: 40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి.రోడ్, విజయవాడ-520 010. ఫోన్ నం: 0866-2474644.

డిమాండ్ నోటీసు (సెక్షన్ 13(2))

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, **ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదారులు 1) మెసర్స్ శ్రీ సత్యదేవ ట్రాన్స్‌పోర్ట్ ఎల్ఎల్‌పి,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్ర రావు, **2) మెసర్స్ శ్రీ రత్నగిరి ట్రేడర్స్ ఎల్ఎల్‌పి,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్రరావు, **3) మెసర్స్ శ్రీ రామ ఇన్‌ఫ్రా & మెటీరియల్స్,** ప్రతినిధియైన దీని పార్టనర్ శ్రీ కళ్యాణపు స్వప్న, **4) మెసర్స్ శ్రీ మారుతి & కం.,** ప్రతినిధియైన దీని యజమాని శ్రీ తుమటి భాస్కర్ రావు, **5) శ్రీ మాగంటి బాబూరావు, 6) శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్ర రావు, 7) శ్రీమతి మాగంటి విజయ లక్ష్మి, 8) శ్రీ తూమటి భాస్కర్ రావు, 9) శ్రీమతి కళ్యాణపు స్వప్న** అనువారు ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి పొందిన రుణాల సదుపాయాలను అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిచెందారు మరియు రుణాలు **నాన్-పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)**గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి వారి గతంలో తెలిసిన చిరునామా పై నోటీసులు జారీచేయబడినవి, కాని అవి వారికి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి అట్టి పరిస్థితుల్లో ఈ బహిరంగ ప్రకటన రూపేనా వారికి తెలియజేయబడుచున్నది.

ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/ హామీదారులు పేరు: 1) మెసర్స్ శ్రీ సత్యదేవ ట్రాన్స్‌పోర్ట్ ఎల్ఎల్‌పి, ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్ర రావు, నివాసం: 4, 74-14-69, లోహియ రెసిడెన్సీ, మెగా టౌన్‌షిప్, న్యూ ఆర్‌టిసి కాలనీ రోడ్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520007- **ఋణగ్రహీత/అభ్యర్థి, 2) మెసర్స్ శ్రీ రత్నగిరి ట్రేడర్స్ ఎల్ఎల్‌పి,** ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్ర రావు, నివాసం: 48-16-11/6ఎ, మహానాడు రోడ్డు, రెవెన్యూ వార్డు 2ఎ, విజయవాడ, ఎన్‌టిఆర్, ఆం.ప్ర-520007. **3) మెసర్స్ శ్రీ రామ ఇన్‌ఫ్రా & మెటీరియల్స్,** ప్రతినిధియైన దీని యజమానురాలు శ్రీమతి కళ్యాణపు స్వప్న, నివాసం: 39-1/1, రమణ కాలనీ, నందిగామ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-521185. **4) మెసర్స్ శ్రీ మారుతి & కం. ప్రతినిధియైన దీని యజమాని శ్రీ తుమటి భాస్కర్ రావు,** నివాసం: 22-78, సాయిపురం కాలనీ, గొల్లపూడి, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర.-521225. **5) శ్రీ మాగంటి బాబూ రావు, తండ్రి పున్నయ్య,** నివాసం: డోర్ నం.74-14-69, ఎఫ్ఎఫ్-4, లోహియా రెసిడెన్సీ, మెగాటౌన్‌షిప్, ఆర్‌టిసి కాలనీ దగ్గర, పటమట, ఆటోనగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520007. **6) శ్రీ మాగంటి శివ పూర్ణ చంద్ర రావు, తండ్రి ఎం. బాబూరావు,** నివాసం: డోర్ నం.74-14-69, ఎఫ్ఎఫ్-4, లోహియా రెసిడెన్సీ, మెగాటౌన్‌షిప్, ఆర్‌టిసి కాలనీ దగ్గర, పటమట, ఆటోనగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520007. **7) శ్రీమతి మాగంటి విజయ లక్ష్మి, భర్త ఎం. శివ పూర్ణ చంద్ర రావు,** నివాసం: డోర్ నం.74-14-69, ఎఫ్ఎఫ్-4, లోహియా రెసిడెన్సీ, మెగాటౌన్‌షిప్, ఆర్‌టిసి కాలనీ దగ్గర, పటమట, ఆటోనగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-520007. **8) శ్రీ తూమటి భాస్కర్ రావు, తండ్రి శేషగిరి రావు,** నివాసం: డోర్ నం.7-67/1, గ్రామసచివాలయం ప్రక్కన, గొల్లపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-521225, **9) శ్రీమతి కళ్యాణపు స్వప్న, భర్త తూమటి భాస్కర్ రావు,** నివాసం: డోర్ నం.7-67/1, గ్రామసచివాలయం ప్రక్కన, గొల్లపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-521225,- **సహ-ఋణగ్రహీతలు/ సహ-అభ్యర్థులు.**

నోటీసు తేది: 15.09.2025	ఎన్‌పిఏ తేది: 17.07.2025

బకాయి మొత్తాలు (03.09.2025 నాటికి): రూ.12,51,89,415/- (రూపాయలు పన్నెండు కోట్ల యాభై ఒక లక్షల ఎనభై తొమ్మిది వేల నాలుగు వందల పదిహేను మాత్రమే)

స్వాధీనంచేసుకొనబడు ఆస్తుల వివరాలు/ సెక్యూర్డ్ అసెట్ చిరునామా:

ఐటెం నం.1: ఎస్ఆర్‌ఓ నందిగామ పరిధిలో, కృష్ణా జిల్లా ప్రస్తుతం ఎన్.టి.ఆర్ జిల్లా, నందిగామ మండలం, నందిగామ నగర పంచాయతి పరిధుల్లో ఎల్.పి.నం.158/2015/విజెడ గా ప్లాట్ నం.7తో సబ్-డివిజన్ ఆర్.ఎస్.నం.319/2బి, పాత ఆర్.ఎస్.నంబరు 319/2 లోకి వచ్చు నందిగామ నగర పంచాయతి వద్దగల 444.444చ.గ.లు (ఎక.0.09సెంట్లు 183చ.లింకులు) విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** 40.0అ.ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.8 ఆస్తి, **పడమర:** జయంతి కాకులయ్య కుమారులు& కూతుళ్ల ఆస్తి, **ఉత్తరం:** ప్లాట్ నం.6 ఆస్తి.
పై నాలుగు సరిహద్దుల్లో డోర్ నం.39-1558 దగ్గర, అన్ని ఉమ్మడి వసతులు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులు మొ॥వాటితో 444.444చ.గ.లు (ఎక.0.09సెంట్లు 183చ.లింకులు) లేదా 371.599చ.మీ.ల ఖాళీ నివాసిత సైటు.

ఐటెం నం.2: ఎస్ఆర్‌ఓ నందిగామ పరిధిలో, కృష్ణా జిల్లా ప్రస్తుతం ఎన్.టి.ఆర్ జిల్లా, నందిగామ మండలం, నందిగామ నగర పంచాయతి పరిధుల్లో ఎల్.పి.నం.158/2015/విజెడ గా ప్లాట్ నం.8తో సబ్-డివిజన్ ఆర్.ఎస్.నం.319/2బి, పాత ఆర్.ఎస్.నంబరు 319/2 లోకి వచ్చు నందిగామ నగర పంచాయతి వద్దగల 444.444చ.గ.లు (ఎక.0.09సెంట్లు 183చ.లింకులు) విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** 40.0అ.ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** 40.0అ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** జయంతి కాకులయ్య కుమారులు& కూతుళ్ల ఆస్తి, **ఉత్తరం:** ప్లాట్ నం.7 ఆస్తి.
పై నాలుగు సరిహద్దుల్లో డోర్ నం.39-1558 దగ్గర, అన్ని ఉమ్మడి వసతులు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులు మొ॥వాటితో 444.444చ.గ.లు (ఎక.0.09సెంట్లు 183చ.లింకులు) లేదా 371.599చ.మీ.ల ఖాళీ నివాసిత సైటు.

ఐటెం నం.3: ఎస్ఆర్‌ఓ నందిగామ పరిధిలో, కృష్ణా జిల్లా ప్రస్తుతం ఎన్.టి.ఆర్ జిల్లా, నందిగామ మండలం, నందిగామ నగర పంచాయతి పరిధుల్లో ఎల్.పి.నం.158/2015/విజెడ గా ప్లాట్ నం.17తో సబ్-డివిజన్ ఆర్.ఎస్.నం.319/2బి, పాత ఆర్.ఎస్.నంబరు 319/2 లోకి వచ్చు నందిగామ నగర పంచాయతి వద్దగల 447.92చ.గ.లు (ఎక.0.09సెంట్లు 255చ.లింకులు) లేదా 374.50చ.మీ. విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** జయంతి నరసింహం & ఇతరుల ఆస్తి, **దక్షిణం:** ప్లాట్ నం.16 ఆస్తి, **పడమర:** 40.0అ.ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** డోర్ నం.39-1558 సమీపాన గొల్లపూడి కనకా రావుకు చెందిన ప్లాట్ నం.18 ఆస్తి.

ఐటెం నం.4: గునదాల జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డోర్ నం.48-19-6/1 సమీపాన, విజయవాడ సిటీ, గునదాల వద్దగల ఆర్.ఎస్.నం.364/2 లోకి వచ్చు 188.65చ.గ.లు (157.73చ.మీ.ల) విస్తీర్ణపు ఖాళీ నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** ఇతరుల ఆస్తి, **దక్షిణం:** మాగంటి శివ పూర్ణ చంద్ర రావు ఆస్తి, **పడమర:** ఉప్పల విజయ లక్ష్మి ఆస్తి, **ఉత్తరం:** పి. మోహన రావు ఆస్తి.
పై నాలుగు సరిహద్దుల్లో అన్ని ఉమ్మడి వసతులు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులు మొ॥వాటితో 188.65చ.గ.లు (157.73చ.మీ.ల) ఖాళీ నివాసిత సైటు.

ఐటెం నం.5: కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల్లో డోర్ నం.48-19-6/1, పాత అసెస్మెంట్ నం.38545జి/1, కొత్త అసెస్మెంట్ నం.288615, ప్రస్తుత అసెస్మెంట్ నం.1073147736తో ప్లాట్ నం.147తో విజయవాడ సిటి, గునదాల వద్దగల ఆర్.ఎస్.నం.363/2 లోకి వచ్చు దానిలో 700చ.అ.ల ప్లింత్ ఏరియాతో ఏ.సి.సి.రూఫ్డ్ షెడ్ నిర్మాణంతోపాటు 176చ.గ.లు విస్తీర్ణపు నివాసిత సైటు. **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నం.146ఎ ఆస్తి, **దక్షిణం:** 30అ.ల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నం.148 ఆస్తి, **ఉత్తరం:** బండిశ్రీరంగం &ఇతరుల ఆస్తి.

నోటీసు మీకు అందే విధంగా చర్యలు తీసుకోబడుచ్చువి. పై రుణగ్రహీతలు మరియు/ లేదా వారి హామీదారులును ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకొనుట జరుగుతుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: విజయవాడ,
తేది: 17.09.2025

సం/- అధీకృత అధికారి,
ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారం నెం.VI (ఎ)

Ref: B1/78/2025 **ది.17-09-2025**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, జగన్నాథపురం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వర రామచంద్రపురం మండలం, కొప్పల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పున:స్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్టు ఆఫీసర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పున:స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం. 42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలక్టరు /ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు | మండలం: జీలుగుమిల్లి | గ్రామం: జగన్నాథపురం

వరుస సంఖ్య	సర్వే నెంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు(తండ్రి / భర్త పేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	2-1	జి.డి.	0.48	0.48	వీరంకి వెంకటేశ్వరరావు తండ్రి: సూరన్న	Sy.No. 4	Sy.No. 1	Veeranki Mutyam	R&B Road	--
2	2-1B	జి.డి.	0.49	0.49	వీరంకి వీర్రాజు, తండ్రి: సూరన్న					
3	2-1C	జి.డి.	0.49	0.49	వీరంకి వీరభద్రుడు, తండ్రి: సూరన్న					
4	4	జి.డి.	4.10	4.10	శ్రీగల జగదేశ్వరరావు, తండ్రి: రామచంద్రరావు	Sy.No. 6	Veeranki Veerababu Land	Sy.No.4 Srigala Ragha vendra rao Land	R&B Road	జీడిమామిడి-266, గుమ్మడి-1, కొబ్బరి-1
5	5	జి.డి.	1.23	1.23	శ్రీగల జగదేశ్వరరావు, తండ్రి: రామచంద్రరావు					
6	4	జి.డి.	2.05	2.05	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	Uddhavarapu Suri Babu Land	Sy.No.4 Srigala Ragha vendra rao Land	Sy.No.4 Srigala Nages warao Land	Sy.No.4 Srigala Jaga deswara Rao Land	--
7	5	జి.డి.	0.62	0.62	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు					
8	4	జి.డి.	2.05	2.05	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	Sy.No.4 Srigala Raje swara Rao Land	Veerenki Mutyam Land	Sy.No.4 Srigala Satya narayana Land	Sy.No.4 Srigala Jaga deswara Rao Land	మామిడి-1
9	5	జి.డి.	0.61	0.61	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు					
10	4	జి.డి.	1.36	1.36	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు	Sy.No.6	Sy.No.4	ROAD	Sy.No.5 Srigala Raje swara Rao	--
11	5	జి.డి.	0.41	0.41	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు					
12	4	జి.డి.	1.37	1.37	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు	Sy.No.5 Srigala Nageswara Rao	Veerenki Chenesw ara Rao Land	Sarupalli Gopala Krishnamraju Land	Sy.No.4 Srigala Raghavendra Rao	జీడిమామిడి-140
13	5	జి.డి.	0.41	0.41	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు					
14	4	జి.డి.	1.37	1.37	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు	Sy.No.5 Srigala Nageswara Rao	Sy.No.4 Srigala Sat yanarayana Land	ROAD	Sy.No.4 Srigala Raghavendra Rao	జీడిమామిడి-100
15	5	జి.డి.	0.41	0.41	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు					
16	9	జి.డి.	0.15	0.15	శ్రీగల జగదేశ్వరరావు తండ్రి: రామచంద్రరావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
17	9	జి.డి.	0.07	0.07	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
18	9	జి.డి.	0.08	0.08	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
19	9	జి.డి.	0.05	0.05	శ్రీగల నాగేశ్వరరావు తండ్రి: పెద్ద అప్పారావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
20	9	జి.డి.	0.05	0.05	శ్రీగల సత్యనారాయణ తండ్రి: పెద్ద అప్పారావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
21	9	జి.డి.	0.05	0.05	శ్రీగల వాసవి తండ్రి: రామచంద్రరావు	V.No. 34 Puchikapadu	R&B Road	Sy.No.8	R&B Road	టేకు-3
22	10	జి.డి.	2.04	2.04	శ్రీగల వీరభద్రరావు తండ్రి: పెద్ద అప్పారావు	Sy.No.10 Srigala Ragha vendra Rao	Sy.No.12	R&B Road	Sy.No. 26	తాడి-25
23	10	జి.డి.	1.02	1.02	శ్రీగల రాజేశ్వరరావు తండ్రి: చిన్నప్పరావు	Sy.No.10 Srigala Jagade swara Rao	Sy.No.10 Veera Bhadrarao	R&B Road	Sy.No. 27	తాడి-12
24	10	జి.డి.	2.03	2.03	శ్రీగల జగదేశ్వరరావు తండ్రి: రామచంద్రరావు	Veeranki Chenesra Rao Land	Sy.No.10 Raghaven dra Rao	R&B Road	Sy.No. 27	టేకు-3, తాడి-4
25	10	జి.డి.	1.01	1.01	శ్రీగల రాఘవేంద్రరావు తండ్రి: చిన్నప్పరావు	Sy.No.10 Srigala Jaga deswara Rao	Sy.No.10 Veera Bha dra Rao	R&B Road	Sy.No. 27	తాడి-13
26	12	జి.డి.	1.69	1.69	అక్కినపల్లి అచ్చమ్మ భర్త: వెంకటరత్నం	Sy.No.10	Grama Kantam	R&B Road	Mango trees	వేప-1
27	14-1	జి.డి.	3.21	3.21	సరిపల్లి రాజ్యంరాజు తండ్రి: జానకి రామరాజు	Sy. No. 14/2	Sy. No. 14/1	Sy. No. 14/1	Korri Mukaiah Land	ఫెన్సింగ్, టేకు-50, మామిడి-220,జీడి మామిడి-40,వేప-3 పనస-1,నేరేడు-1, రోజ్‌వుడ్-4,వెదురు -20, తాడి-2
28	14-1	జి.డి.	3.00	3.00	సరిపల్లి వెంకటలక్ష్మి సత్యనారాయణరాజు తండ్రి: జానకి రామరాజు	Sy. No. 14/2	Sy. No. 16	Sy. No. 15 & R&B Road	Sy.No. 14/1	ఫెన్సింగ్, టేకు-42, మామిడి-200,జీడి మామిడి-40,వేప-2 పనస-1,నేరేడు-1, రోజ్‌వుడ్-7,వెదురు 20, తాడి-2, కొబ్బరి -3,సిందుగా-1, మునగ-1,జామ-2
29	14-1	జి.డి.	3.11	3.11	సరిపల్లి సుందర రామరాజు తండ్రి: రామలింగరాజు	Sy. No. 14/2	Sy. No. 14/1	Sy. No. 14/1	Thodam Munna iah Land	--
30	14-1A	జి.డి.	1.00	1.00	సరిపల్లి సుందర రామరాజు తండ్రి: రామలింగరాజు	Sy. No. 14/2	Sy. No. 14/1	Sy. No. 14/1	Thodam Munna iah Land	--
31	18	జి.డి.	5.17	5.17	సరిపల్లి శ్రీనివాసరాజు తండ్రి: వెంకట సోమరాజు	Sy. No. 26/2	Sy. No. 19	Sy. No. 17	Sy. No. 26/1	--
32	26-2A	జి.డి.	1.04	1.04	సరిపల్లి శ్రీనివాసరాజు తండ్రి: వెంకట సోమరాజు	Sy. No. 14/1	Sy. No. 18	Sy. No. 14/1	Sy. No. 26/5	--
33	26-2	జి.డి.	2.10	2.10	సరిపల్లి సుందర రామరాజు తండ్రి: రామలింగరాజు	Sy. No. 14/1	Sy. No. 18	Sy. No. 14/1	Sy. No. 25/5	--
Total extent			44.32	44.32						

సం/- **డి.చంద్రశేఖర్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి

● ప్రధాని, కేంద్ర విద్యా శాఖ మంత్రికి ఎస్‌టిఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు టెట్ తీర్పు, ఆర్‌టిఇ చట్టంలోని సెక్షన్ 23 సవరణపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) కోరింది. ఈ మేరకు బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రికి, కేంద్ర విద్యా మంత్రికి ఎస్‌టిఎఫ్‌ఐ అధ్యక్షులు సిఎన్ భారతి, ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి టికె షఫీ వినతి పత్రం అందజేశారు. టెట్ సిలబస్, అర్హత మార్పుల సవరణ కోసం ఎన్‌సిటిఇకి ప్రాతినిధ్యానికి ఆర్‌టిఇ చట్టంలోని సెక్షన్ 23 సవరణపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. ఈ నెల 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, పదవీ విరమణ వరకు ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులు కావాలని లేదా పదవీ విరమణ ఎదుర్కోవాలని ఆదేశించిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2010 ఆగస్టు 23కి ముందు దేశవ్యాప్తంగా నియామకం అయిన సుమారు 25 లక్షల మంది ఉపాధ్యాయులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. 20-25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. 2010 ఆగస్టు 23 తరువాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ తప్పనిసరి చేయడానికి విద్యా హక్కు (ఆర్‌టిఇ) చట్టంలోని సెక్షన్ 23కి సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లగా ఆర్‌టిఈ చట్టం అమలులోకి రాకముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఈ) లేదా రాష్ట్ర ప్రభుత్వాలు సూచించలేదని నేతలు పేర్కొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో

మరో భూపోరాటం

● ఢిల్లీలో ప్రతిజ్ఞ



హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్ ఆవరణలో వివిధ ప్రజా సంఘాల నేతల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరో భూపోరాటానికి సిద్ధంగా కావాలని నేతలు పిలుపు ఇచ్చారు. వీర తెలంగాణ విప్లవ పోరాట వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్ ఆవరణలో వివిధ ప్రజా సంఘాల నేతలు ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బీరెడ్డి సాంబశివ అధ్యక్షతన జరిగిన సభలో ఏఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం సాగినదే వీర తెలంగాణ విప్లవ పోరాటం కష్టజీవులకు, ప్రజా ఉద్యమాలకు నిరంతరం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. రజాకార్ల పీచమణచాలని, దున్నేవానికి భూమి దక్కాలని, విశాలాంధ్రలో ప్రజారాజ్యం సాధించాలని ఎర్రజెండాను ఎత్తుకొని సుందరయ్య ఆధ్వర్యంలో సాగిన ఆ సమరంలో నాలుగు వేలమంది ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. నీ బానిసను దొర, నీ కాలు మొక్కుతా అనే స్థితిలో ఉన్న అట్టడుగు కష్టజీవులు బందూకులు బట్టి భూస్వాముల జమీందారులు నైజాం నవాబులను తరిమికొట్టిన చరిత్ర ఆ పోరాటానిదని గుర్తు చేశారు. లక్షలాదిమంది ప్రజల భాగస్వామ్యంతో సాగిన ఆ పోరులో 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచిన చరిత్ర ఆ కమ్యూనిస్టులు ఎర్రజెండాదన్నారు. ఆ పోరాటం దొడ్డి కొమరయ్య అమరత్వంతో, చిట్యాల ఐలమ్మ పోరాట తెగువతో నైజాం సర్కారుకు గోరీ కట్టిందన్నారు. ఆ పోరాటంలో ఏ మాత్రం అడుగు పెట్టని వారు, సిగ్గు లేకుండా దానికి మేము వారసులమని చెప్పుకోవడం మతోన్మాదులకే చెల్లిందని విమర్శించారు.

కుల, మత ప్రాంతీయ తత్వాలకు అతీతంగా కష్టజీవులంతా ఏకోన్ముఖంగా నరహంతక నైజాం నవాబుకు వ్యతిరేకంగా సాగించిన పోరాటాన్ని మతోన్మాదులు మత పోరాటంగా సృష్టించడం సిగ్గుచేటని అన్నారు. అమరవీరుల రక్తతర్పణతో సాధించిన భూములను కాపాడుకునేందుకు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పేదల నుండి బలవంతంగా భూములు గుంజుకునే చర్యలకు వ్యతిరేకంగా మరో భూ పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు.

ఐద్వా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూ వీరతెలంగాణ విప్లవ పోరాటం వంటింటికి పరిమితమైన మహిళలను ఉద్యమంలో దూకించిందని, సనాతన భావాలను తుంగలో తొక్కి సాయుధ పోరాటబాట పట్టించిందని తెలిపారు. నాటి బాలిక మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి వరకు ఆ పోరులో ఎందరో వీరవనితలు ఆయుధాలు పట్టి నైజాం సైన్యాన్ని మట్టుపెట్టారని గుర్తు చేశారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకులు కంకణాల ఆంజనేయులు, జివిఎల్ నరసింహారావు, రామ్మోహన్, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, నేతలు మూడు శోభన్, బొంతు రాంబాబు, అన్నవరపు కనకయ్య, జంగారెడ్డి, ఎర్రా శ్రీను, పుల్లయ్య, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెరుచుకున్న శ్రీనగర్ -జమ్ము హైవే

శ్రీనగర్ : శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44)ని బుధవారం భారీ వాహనాల కోసం తెరిచారు. గత మూడువారాలుగా ఈ హైవేను మూసివేయడంతో వందలాది ట్రక్కులు ఈ రహదారిపై నిలిచిపోయిన సంగతి తెలిసిందే. గత నెల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో.. జమ్ముకాశ్మీర్‌ను ఇతర ప్రాంతాలకు కలిపే కీలకమైన ఈ రహదారిని అధికారులు మూసివేశారు. 270కి.మీ పొడవైన శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారి గతవారం తిరిగి తెరుచుకున్నప్పటికీ.. కేవలం తేలికపాటి వాహనాలను మాత్రమే అనుమతించారు. దీంతో కాశ్మీర్ నుండి ఆపిల్ పండ్లను రవాణా చేసే వాహనాలతో పాటు భారీ వాహనాలు రోజుల తరబడి నిలిచిపోయాయి. రోజుల తరబడి ఆపిల్ వాహనాలు రోడ్లపై ఉండటంతో ఆపిల్ పళ్లు చెడిపోయాయి. రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఒక కుట్రతోనే జాతీయ రహదారిని మూసివేశారని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం రహదారిని ప్రారంభించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కర్ణాటక ఎస్‌బిఐలో భారీ దోపిడీ

● రూ 20 కోట్ల విలువైన నగలు, రూ కోటీ చోరీ

బెంగళూరు : కర్ణాటకలో భారీ దోపిడీ జరిగింది. ఆర్మీ తరహా దుస్తుల్లో వచ్చిన ముగ్గురు సాయుధ దుండగులు సుమారు 20 కోట్ల రూపాయల విలువైన నగలను, రూ. కోటి రూపాయల నగదును దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటకోని చడచన్ పట్టణంలోని ఎస్‌బిఐ బ్రాంచ్‌లో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. ఆర్మీ తరహా యూనిఫామ్ ధరించిన ముగ్గురు దుండగులు బ్యాంక్‌లోకి ప్రవేశించారు. మేనేజర్, ఇతర ఉద్యోగుల చేతులను కట్టేసి, టాయిలెట్ లోపల బంధించారు. దోపిడీ సమయంలో బ్యాంక్ మేనేజర్ అలారమ్ బెల్‌ను నొక్కకుండా ఆయుధాలతో బెదిరించారు. సిబ్బందిని బెదిరించి స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళ్లి నగదు, ఆభరణాలను దోచుకువెళ్లారు.

సమాచారం తెలుసుకున్న చడచన్ పోలీస్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నింబార్గి, సీనియర్ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్ కలిగిన వ్యాన్‌ను వినియోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బ్యాంకు దోపిడీ అనంతరం దొంగల ముఠా మహారాష్ట్రలోని పంధర్‌పూర్ వైపు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. సోలాపూర్ జిల్లా సమీపంలో ప్రమాదం జరిగిందని, అక్కడ స్థానికులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిపారు. అనంతరం ద్విచక్రవాహనంపై అక్కడి నుండి పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు.

రూ.9,899కే గెలాక్సీ ఎ06 5జి..!

న్యూఢిల్లీ : పండుగ సీజన్‌కు ముందే తమ ఫోన్లపై ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నట్లు సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తెలిపింది. ఇందులో భాగంగానే గెలాక్సీ ఎ06 5జి మోడల్‌ను రూ.9,899కు విక్రయిస్తోన్నట్లు వెల్లడించింది. సరసమైన ధరలో పూర్తి 5జి అనుభవాన్ని పొందవచ్చని పేర్కొంది. ప్రతీ నెల వాయిదా పద్దతిలో రూ.909 చెల్లించి కొనుగోలు చేయవచ్చని పేర్కొంది. ఇందులో 50ఎంపి మెయిన్ కెమెరా, 2ఎంపి డెప్త్ కెమెరా సహా 8ఎంపి సెల్ఫీ కెమెరాలను అమర్చింది.

జాతీయ సంతాపదినాన్ని పాటించిన నేపాల్

ఖాట్మండు : ఇటీవల దేశంలో తలెత్తిన నిరసనలు,ఆందోళనల్లో మరణించిన వారికి సంతాప సూచకంగా నేపాల్ బుధవారం జాతీయ సంతాప దినాన్ని పాటించింది. ఈ మేరకు హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు మూతబడ్డాయి. విదేశాల్లోని నేపాల్ ఎంబసీలు, దౌత్య కార్యాలయాలు కూడా మూతబడ్డాయి. జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. ఈనెల 8, 9 తేదీల్లో నిరసనల్లో మరణించిన వారందరూ అమరవీరులని ప్రధాని సుశీలా కర్కి ఇప్పటికే ప్రకటించారు. ముగ్గురు పోలీసులతో సహా 72మంది మరణించారు. ఇదిలావుండగా, ఖాట్మండు సహా ప్రధాన నగరాల్లో నెమ్మదిగా జన జీవనం సాధారణ స్థితికి చేరుకుంటోంది. భద్రతా పరిస్థితులు కూడా మెరుగయ్యాయి. నిరసనల్లో జరిగిన నష్టాన్ని, విధ్వంసాన్ని అంచనా వేయడానికి పలు మంత్రిత్వ శాఖలు రంగంలోకి దిగాయి. వందల సంఖ్యలో వాహనాలకు నిప్పంటించడంతో పోలీసులు కూడా తగలబడిన వాహనాలు నెంబరు, ఇతర వివరాలను సేకరిస్తున్నారు.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు 15 మంది మృతి

● 16 మంది గల్లంతు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో మంగళవార కురిసిన భారీ వర్షాలకు 15 మంది మృతి చెందారు. డెహ్రాడూన్‌లో 13 మంది, పిథోరాఘర్, నైనిటాల్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 15 మంది చనిపోయారని ఎస్‌డిఆర్‌ఎఫ్ బుధవారం తెలిపింది. వీరిలో 14 మంది మృతదేహాలను గుర్తించినట్లు తెలిపింది. అలాగే, మరో 16 మంది గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. రెస్క్యూ ఆపరేషన్స్‌లో సుమారు 900 మందిని కాపాడారు. ముగ్గురికి తీవ్ర గాయాలైతే వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. నదులు ప్రవాహంతో డెహ్రాడూన్‌లో ఇళ్లకి నీరు చేరి నివాసితులు ఎన్నో ఇబ్బందులుపడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డాయి. వరదల వల్ల రోడ్లు, ఇళ్లు ధ్వంసమయ్యాయి.

నెల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

అధికార పార్టీ నేతకు చెందినదిగా చెప్తున్నారు. సంగం సిఐ వేమారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఎం, మాజీ సిఎం, మంత్రులు దిగ్భ్రాంతి

ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మాజీ సిఎం జగన్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శివర్గ సభ్యులు కాయం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇసుక టిప్పరు అతివేగం, అధిక లోడ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఇజ్రాయిల్‌కు గూఢచర్యం ఆరోపణలపై వ్యక్తిని ఉరితీసిన ఇరాన్

దుబాయ్ : ఇజ్రాయిల్‌కు గూఢచర్యం నెరుపుతున్నాడని ఆరోపిస్తూ ఒక వ్యక్తిని ఇరాన్ బుధవారం ఉరి తీసింది. ఆ వ్యక్తిని బాబక్ షాబాజిగా గుర్తించారు. ఇరాన్ డేటా సెంటర్లకు, భద్రతా సంస్థలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఇజ్రాయిల్‌కు విక్రయిస్తున్నాడని జ్యుడీషియరీకి చెందిన మిజాన్ వార్తా సంస్థ తెలిపింది. అయితే మానవ హక్కుల కార్యకర్తలు దీంతో విభేదిస్తున్నారు. ఉక్రెయిన్‌కు తాను సాయమందించడానికి సిద్ధంగా వున్నానంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఒక లేఖ రాసినందుకే షాబాజిని నిర్బంధించారని వారు పేర్కొంటున్నారు.

జెలెన్‌స్కీకు పంపిన సందేశాన్ని ఒక ఉదాహరణగా చూపుతూ ఇజ్రాయిల్‌కు గూఢచర్యం చేస్తున్నారని ఆరోపణలు చేశారని మానవ హక్కుల గ్రూపు పేర్కొంది. ఇరాన్, రష్యాకు డ్రోన్లను సరఫరా చేస్తోంది. వాటిని ఉపయోగించి ఉక్రెయిన్‌పై దాడులకు రష్యా దిగుతోంది. ఈ నేపథ్యంలో షాబాజిని ఉరితీసే ప్రమాదం వుందంటూ ఇరాన్ హ్యూమన్ రైట్స్ ఇప్పటికే హెచ్చరికలు చేసింది. ఉరి శిక్ష ఏ విధంగా అమలు జరిగిందనే వివరాలు బయటకు రాలేదు. ఇజ్రాయిల్‌తో 12రోజుల పాటు జరిగిన యుద్ధంలో గూఢచర్యానికి పాల్పడ్డారంటూ ఇరాన్ 8మందిని ఉరి తీసింది.


ప్రైవేటీకరణే మా విధానం

(మొదటిపేజీ తరువాయి)


ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రైవేటీకరణ విధానం వల్లే స్టార్టప్ కంపెనీలు పలు రాష్ట్రాల్లో పెరిగాయన్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా ఎపి సాగుతుందన్నారు. విశాఖ కేంద్రంగా జిసిసి ఆర్థిక ప్రగతికి, మానవాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పారిశ్రామికవేత్తలకు రాష్ట్రప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2028 నాటికే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ కూడా 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ రూపొందించామని చెప్పారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదంతో కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటంతో పాటు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, ఆలోచనలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతంతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఆగస్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అమరావతి నగరాన్ని గ్రీన్ ఫీల్డ్ నగరంగా నిర్మిస్తున్నామని, విజయవాడ-గుంటూరులను అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెలలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని తెలిపారు. టెక్నాలజీ పరంగా దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నట్టు వివరించారు.

జిఎస్‌టి సంస్కరణలతో వికసిత్ భారత్‌కు పునాదులు

దేశంలో అన్ని వర్గాల ప్రజలపై ప్రభావం చూపేది జిఎస్‌టి మాత్రమేనని, అందుకే ప్రజలపై భారం తగ్గించేలా, అందరికి ఆమోదయోగ్యమైన సంస్కరణలను చేపట్టామని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మధురవాడలోని వి.కన్వెన్షన్స్‌లో నిర్వహించిన జిఎస్‌టి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ... జిఎస్‌టిపై గత, ప్రస్తుత స్లాబ్‌లు, ఏయే వస్తువులపై ఎంతెంత పన్ను తగ్గింపు, పన్ను నుంచి పూర్తిగా మినహాయింపు పొందిన వస్తువులు తదితర అంశాలపై సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా, ఆర్థికంగా ప్రజలకు, ప్రభుత్వానికి మేలు జరిగేలా జిఎస్‌టి సంస్కరణలు ఉన్నాయన్నారు.



సంగారెడ్డి సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వేదికపై నాయకులు



నల్లగొండ సభలో మాట్లాడుతున్న బృందాకరత్, వేదికపై నాయకులు

నిజాం తరహాలోనే మోడీ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుపోవాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు ముందు జనగామ జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. జనగామ పట్టణ ప్రధాన రహదారులు ఎర్రదండుమయమయ్యాయి.

కొత్త రూపాల్లో వెట్టిచాకిరి

సంగారెడ్డిలో రాఘవులు మాట్లాడుతూ.... పోరాటాల ద్వారా సాధించుకున్న భూములను రైతుల నుంచి గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అప్పనంగా అప్పగిస్తూ కార్పొరేట్ భూస్వాములను సృష్టిస్తుందన్నారు. ఆనాడు తెలుగును అణచివేసి నిజాం మాతృభాష అయిన పర్షియన్, ఉర్దూ భాషను ప్రజలపై రుద్దితే ఇప్పుడు బిజెపి హిందీ, సంస్కృతం భాషను దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన విషయమన్నారు. నాటి నైజాం పాలనలో వెట్టి చాకిరి పేరుతో కష్టజీవులు బానిసలుగా బతికారని, ఇప్పుడు బిజెపి పాలనలో మళ్లీ కొత్త రూపాల్లో వెట్టి చాకిరి పరిస్థితులను కండ్ల ముందు ఉంచుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలికే విధంగా చర్యలకు పూనుకుంటుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నిజాం సర్కారుకు వారసులుగా ప్రకటించుకుని సంబరాలు జరుపుకుంటే సరిగ్గా సరిపోతుందని, కానీ ఎలాంటి నైతిక హక్కులు లేనప్పటికీ ఈ సంస్థలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని విమోచన దినంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు.

చరిత్రను వక్రీకరించే కుట్ర

నల్లగొండ సభలో బృందాకరత్ మాట్లాడుతూ... "కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన విరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో విషపురుగులైన కాషాయ ఉన్మాదులకు ఏం సంబంధం..? మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే నైతిక అర్హత మతోన్మాద బిజెపికి లేదు' అని అన్నారు. భూమికోసం భుక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపాలని హితవు పలికారు. నైజాం, రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో ఈ గడ్డ మీద పుట్టిన మైనార్టీలైన ముస్లింలు కూడా ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని ఈ తరానికి అందించకుండా.. దానికి మతం రంగు పులిమి యువతరాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



బర్త్ డే గిఫ్ట్



'ఏమైంది విహాన్.. అంత నిరాశగా వున్నావ్' అడిగాడు తాతయ్య

'ఏమీలేదూ... మా ఫ్రెండ్ రాంజీ బర్త్ డే వేడుకలో వాడిచ్చిన గిఫ్ట్ చూసి నీరసం వచ్చింది' అన్నాడు విహాన్. 'ఏ గిఫ్ట్ ఇచ్చాడు నీ ఫ్రెండ్' అడిగాడు తాతయ్య. 'మొక్క తాతయ్య' నీరసంగా అన్నాడు విహాన్.

'ఈ ఐడియా ఎవరిదీ' అడిగాడు తాతయ్య. 'ఇంకెవరిది, వాడి తాతయ్యది' అని చెప్పాడు విహాన్. 'వెరీ గుడ్' చాలా మంచి పని చేశారు వాళ్లు' అన్నాడు తాతయ్య.

'అదేంటి తాతయ్య అలా అంటావు. 'మా ఫ్రెండ్స్ అందరం కలిసి రాంజీకి ఖరీదైన గిఫ్ట్ ఇచ్చాం. వాడేమో ఇలాంటి పిచ్చిది ఇచ్చాడు. పైగా మాకు కూడా వాళ్ల తాతయ్య మా పుట్టినరోజులకి కూడా మొక్కలను బహుమతులుగా ఇవ్వమని సలహా ఇచ్చారు' అన్నాడు చిరాగ్గా ముఖం పెట్టి విహాన్.

'అడవులు తగ్గిపోయి కాలుష్యం ఎక్కువవుతుందని నీకు తెలుసు కదా విహాన్' అన్నాడు తాతయ్య. 'అవును ఆ విషయం మా మాష్టారు కూడా చెప్పారు' అన్నాడు విహాన్. 'మొక్కల పంపకం– వాటి పెంపకం ప్రాధాన్యతను పరోక్షంగా రాంజీ తాతయ్య మీకు బోధించారు. పెద్దల మాటలు – చేతలు భావి తరాల బాగుకోసమే. కాబట్టి నువ్వు అపార్థం చేసుకోకు. నీ స్నేహితులకి కూడా ఈ విషయం చెప్పు. మొక్కలు నాటడం అందరూ బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే పర్యావరణాన్ని కాస్తైనా కాపాడిన వాళ్లమవుతాం సరేనా' అన్నాడు తాతయ్య.

'సరే తాతయ్యా నా స్నేహితుని మీద నాకు వచ్చిన చెడ్డ అభిప్రాయాన్ని చాలా సునాయాసంగా పోగొట్టావు. 'థ్యాంక్స్'' అంటూ తాతయ్యని కౌగలించుకున్నాడు విహాన్.

– ఎం.వి.స్వామి, అనకాపల్లి,
94415 71505.



నేనొక చెట్టుని

నేనొక చెట్టుని
నేనొక చెట్టుని
నేను లేక మనుషులు లేరు
నేను లేక లోకం లేదు

పచ్చ పచ్చని చెట్టుని
ఆహారాన్నిచ్చే చెట్టుని
నేనుంటేనే ప్రకృతికందం
నేనుంటేనే ప్రకృతికానందం

అందమైన చెట్టుని
ఉపయోగాల చెట్టుని
జంతువులకు మనుషులకు
ఆక్సిజన్ ఇచ్చే చెట్టుని
ఔషధాలు పంచే చెట్టుని
కాయలు పండ్లను మీకిచ్చి


కలపను మీ కందించి
ఆనందాన్నందించే చెట్టుని

చల్లని నీడను ఇస్తాను
చల్లని గాలులు వీస్తాను
కాలుష్యాన్ని పీలుస్తాను
పక్షులకు గూడునౌతాను!



– షేక్ నస్రీన్ బేగం,
9వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ),
కర్నూలు.

నేను గీసిన బొమ్మ





- ఎల్.హర్షవర్ధన్ కుమార్,
9వ తరగతి,
శర్వాణి విద్యాలయం,
నరసన్నపేట

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

టెక్నాలజీతో వైద్య విద్యలో కొత్త పుంతలు

సాంకేతికత అన్ని రంగాలను ప్రభావితం చేస్తోంది. మనిషి జీవన విధానంపై కూడా సాంకేతికత ప్రభావం చాలా వుంది. విద్యాబోధనపై సాంకేతికత, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ప్రభావం ఊహించలేనంతగా వుంది. విద్యాబోధన అనేది మూడు దశల్లో ఇమిడి వుంది. ఒకటి ప్రోగ్రాంకు తగిన సబ్జెక్టులు, పాఠ్యాంశాలు నిర్ణయించడం, రెండోది అసలు బోధనా కార్యక్రమం, మూడోది పరీక్షలు నిర్వయించటం, మూల్యాంకన ప్రక్రియ జరపటం.

సబ్జెక్టులు, వాటి పాఠ్యాంశాలు తయారు చేయటం చాలా కష్టపరమైన పని. పాఠ్యాంశాలు ప్రస్తుత వాస్తవ పరిస్థితుల అనుగుణంగా వుంటూ రాబోయే సామాజిక మార్పులు కూడా ప్రతిబింబింపచేయాలి. వైద్య రంగంలో సంబంధించిన అంశాలు, విషయాలు నిరంతరం మార్పునకు గురౌతున్నాయి. కొత్త జబ్బులు వెలుగులోకి వస్తున్నాయి. వైద్య విధానాలు, మందులూ మారుతున్నాయి. ఈ మార్పులన్నీ పాఠ్యాంశాల్లో ప్రతిబింబించే విధంగా ప్రక్రియ జరగాలి. వైద్యానికి సంబంధించిన మార్పులు, తదితర విషయాలన్నింటిపై సమగ్రంగా సాంకేతికత తోడ్పాటుతో తెలుసు కోవచ్చు. కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతలోని చాట్ జీపీటీ, డీప్ సీక్, ఎఐ రీసెర్చ్ అసిస్టెంట్ లాంటివి పాఠ్యాంశాల విషయాల్లో చాలా తోడ్పాటుగా ఉంటున్నాయి.

సాంకేతికతతో కృత్రిమ నమూనాలు

బోధనలో సాంకేతికత పరిజ్ఞానం పాత్ర నానాటికీ పెరుగుతోంది. వైద్య విద్య బోధనలో పాత (సాంప్రదాయ) పద్ధతులను తీసి పారేయలేము. చాక్, టాక్ బోధన విధానంలో నమూనాలు (మోడళ్లు), ప్రయోగశాలలు, మృతదేహాలు, అసలు రోగులు వంటివి బోధనకు దోహద పడుతున్నాయి. కానీ, అవే బోధన పద్ధతులు ఇప్పుడు సరిపోవు. కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికతతో విద్యను చాలా సమర్థవంతంగా బోధించొచ్చు. ఉదాహరణకు వర్చువల్ రియాలిటీ అండ్ ఆర్గ్యుమెంటెడ్ రియాలిటీ అనే సాంకేతికతలు బోధనకు గొప్పగా ఉపయోగపడుతున్నాయి. వాటి ద్వారా తయారైన నమూనాలు శరీరంలోని ప్రతి భాగం, అవయవంలోని అణువణువునూ తెలుసుకునే విధంగా తోడ్పడుతున్నాయి. ఇలాంటి విద్య వాస్తవ రీతిలో వీలుపడదు. వర్చ్యువల్‌గానే వీలవుతుంది. దీనినే హాండ్సాన్ లెర్నింగ్ (అనుభవం ద్వారా నేర్చుకోవటం) అంటారు. ఈ పద్ధతిలో విద్యను చాలా సమర్థవంతంగా నేర్చుకోవచ్చు.

అనుభవం నేర్పే పాఠాలు మార్గదర్శకం

వైద్య విద్యలో హాండ్సాన్ లెర్నింగ్ అనేది సామాన్యం. కానీ, టెక్నాలజీ ద్వారా బోధన– విద్యాభ్యాస సామర్థ్యం పెరుగుతాయి. విద్యార్థులు మామూలు పద్ధతుల్లో నేర్చుకోలేనివి సాంకేతికత సహాయంతో నేర్చుకోవచ్చు. టెక్నాలజీ ద్వారా వర్చ్యువల్ రోగులను కావాల్సిన విధంగా కూడా తయారు చేసి తగు విధంగా విద్యను బోధించొచ్చు. నేర్చుకోవచ్చు.

వర్చ్యువల్ క్లాసురూములు, కాన్ఫరెన్సులు ఏర్పాటు చేసుకుని అందులో విద్యార్థులు భాగస్వామ్యులు కావొచ్చు. ఉదాహరణకు తిరుపతిలో ఉన్న విద్యార్థి వర్చ్యువల్ క్లాస్‌రూమ్ ద్వారా ప్రపంచంలోని ఏ విద్యార్థితోనైనా సహచరుడిగా వుంటూ అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన పరిశోధకుని మాటలు వినొచ్చు. అలాంటి వెసులుబాటు టెక్నాలజీ ద్వారానే సాధ్యం. మామూలుగా ఒక తరగతిలో వివిధ సామర్థ్యం కలిగిన విద్యార్థులు ఉంటారు. కొందరు తొందరగానూ, మరి కొందరు ఆలస్యంగా అర్థం చేసుకుంటారు. కానీ ఉపాధ్యాయుడు అందరికీ ఒకే విధంగా బోధిస్తాడు. దాని వలన చాలా మంది విద్యార్థులు నిరుత్సాహానికి, అసహనానికి లోనౌతారు. అలా కాకుండా, కృత్రిమ మేధస్సు సహాయంతో విద్యార్థులకు వారి శక్తి, సామర్థ్యాలూ, అభిరుచులను బట్టి బోధనా కార్యక్రమాన్ని రూపొందించొచ్చు.

పరీక్షలు, మూల్యాంకనానికి వస్తే, టెక్నాలజీ చాలా విధాలుగా ఉపయోగ పడుతుంది. ప్రశ్నలు తయారు చేయటం సులభమైన పని కాదు. ఒక పక్కన ప్రశ్నలు సిలబస్‌కు తగినట్లు వుంటూ విద్యార్థి ఆ కోర్సులో ఎంత వరకు జ్ఞానం, విజ్ఞానం సంపాదించాడు అనేవి అంచనా వేసే దానికి తోడ్పడాలి. ఒక పరీక్షలో వివిధ రకాలుగా ప్రశ్నలుంటాయి. ఉపాధ్యాయులు అలానే ప్రశ్నలు తయారు చేస్తారు. కానీ టెక్నాలజీ సహాయంతో చాలా సామర్థ్యం గల ప్రశ్నలు తయారు చేసుకోవచ్చు. ప్రశ్నలు తయారు చేయటమే కాకుండా మూల్యాంకన విషయంలో కూడా టెక్నాలజీని ఉపయోగించుకోవచ్చు. అలాంటి మూల్యాంకన విధానంలో మానవ తప్పిదాలు లేకుండా ఉంటాయి. నిరంతర, సమగ్ర మూల్యాంకనం అనేవి బోధన– విద్యాభ్యాస ప్రక్రియలో భాగం. అవి విద్యార్థి సామర్థ్యాలను కనుగొనే దానికి దోహద పడటమే కాకుండా విద్యార్థి, ఉపాధ్యాయుని లోటుబాట్లను తెలుసుకునే సౌకర్యం కల్గిస్తాయి. తన్ను తానును మలుచుకోవటానికి, నియంత్రించుకోవటానికి అలాంటి ఫీడ్‌బ్యాక్ ఉపయోగ పడుతుంది..

మరింత పరిశోధనలు అవసరం

వైద్య విద్యలో పరిశోధనలు చాలా ముఖ్యం. ప్రతి పాఠం పరిశోధన, రిజల్ట్స్‌తో ముడి పడి ఉండాలి. అప్పుడే ఆ విద్య ఉపయోగకరం. నిత్య పరిశోధన అనేది వైద్య విద్యలో అంతర్భాగం. అంటే ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు నిరంతర పరిశోధకుడిగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కృత్రిమ మేధస్సు ఆధారిత టెక్నాలజీ, పరిశోధనల్లో చాలా ఉపయోగకరం. ఉదాహరణకు ఎఐ రీసెర్చ్ అసిస్టెంట్ సహాయంతో చక్కటి పరిశోధన చేయొచ్చు. పరిశోధన ఫలితాలు క్లాస్‌రూమ్‌కు తీసుక పోవటమే కాకుండా, మంచి హై ఇంప్యాక్ట్ జర్నల్స్‌లో ప్రచురించొచ్చు. పరిశోధనా ఫలితాలకు పేటెంట్స్ కూడా తెచ్చుకోవచ్చు. ఇలా టెక్నాలజీ, వైద్య విద్యాభ్యాసంలో కనీ వినని రీతిలో ఉపయోగ పడుతున్నాయి. వివిధ టెక్నాలజీలు, ఇ–ప్లాట్‌ఫారాలు, యాప్స్ వంటివి అందరికీ అందుబాటులో ఉంటున్నాయి. సామాన్య విద్యార్థికి, ఉపాధ్యాయునికి టెక్నాలజీ తనకు మించిన ఖర్చుతో కూడుకున్నవి. విద్యా సంస్థలే ఇ–ప్లాట్‌ఫార్మ్స్ అందుబాటులోకి తెచ్చి పూర్తిస్థాయి విద్యాభ్యాసం, పరిశోధనలు ఎఐ బేస్ట్ టెక్నాలజీ ఆధారితంగా చేయాలి. అప్పుడే నేర్చుకునే విద్యకు అర్థం, పరమార్థం ఉంటుంది. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి సమక్షంలో సెప్టెంబర్ 10న ఈ విషయాలపైన రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సందేశం ఇచ్చాను.



– డాక్టర్ తుమ్ములూరి సిద్ధయ్య
విశ్రాంత రిజిస్ట్రార్,
శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం,
తిరుపతి.



గుత్తా జ్వాల చనుబాల దానం

నవజాత శిశువులకు అమ్మ పాలు అమృతం అంటారు. అప్పటికప్పుడు ఆకలి తీర్చటానికే కాదు; భవిష్యత్తులో వచ్చే అనారోగ్యాల బారి నుంచి కాపాడటానికి కూడా అవి గొప్పగా దోహదపడతాయని వైద్యులు చెబుతారు. అయితే, కొందరు తల్లులకు తమ పిల్లలకు అవసరమైనన్ని పాలు ఉత్పత్తి కావు. ఇంకొంతమంది తల్లులకు వివిధ కారణాల వల్ల పిల్లలకు పాలివ్వలేరు. అలాంటి సందర్భాల్లో పిల్లల అవసరాలు తీర్చటానికి చనుబాలు దానం ఇవ్వటం ఇప్పుడు మంచి ప్రయత్నం. ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల తన బిడ్డకు ఇవ్వగా, అదనంగా ఉన్న పాలను ఈ విధంగా దానం ఇస్తున్నారు.

జ్వాల ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన ఒక బిడ్డకు జన్మనిచ్చారు. బిడ్డకు పాలు ఇచ్చాక తన వద్ద అదనంగా ఉన్నట్టు గుర్తించారు. వాటిని అవసరమైన పిల్లల కోసం దానం ఇవ్వొచ్చా? అని తమ ఫ్యామిలీ డాక్టర్‌ను సలహా అడిగారు. 'ఖచ్చితంగా ఇవ్వొచ్చు.' అని ఆమె చెప్పగానో – ప్రభుత్వ ఆసుపత్రి నీలోఫర్‌ని సంప్రదించి, అవసరమైన పసిబిడ్డలకు తన చనుబాలను పంపిస్తున్నారు. ఇప్పటివరకూ సుమారు 30 లీటర్ల చనుబాలను దానం చేసినట్టు జ్వాల చెప్పారు. ఈ విషయమై ఆమె మాటల్లో తెలుసుకుందాం.

"బిడ్డకు పాలిస్తున్న మొదటి వారం, పది రోజుల్లోనే నా వద్ద ఎక్కువ పాలు ఉత్పత్తి అవుతున్నట్టు గమనించాను. డొనేట్ చేయటం గురించి డాక్టర్ మంజుల అనగానిని అడిగితే– ఖచ్చితంగా చేయొచ్చని చెప్పారు. మా కజిన్ సిస్టర్‌కు నెలలు నిండకుండా బిడ్డ పుట్టినప్పుడు ఇలాగే మొదటి నెల బయటినుంచి చనుబాలు తీసుకొచ్చినట్టు నాకు గుర్తుంది. నా చనుబాలు వృథా చేసే బదులు అవసరమైన ఇవ్వాలని అనుకున్నాను. రోజూ 60, 70 మంది ప్రసవించే నీలోఫర్ ఆసుపత్రికి ఇవ్వటం మంచిదని అనుకున్నాను. పోషకాహారం లేక నెలలు నిండగానే ప్రసవించే తల్లులు ఉంటారని విన్నాను. ఆ బిడ్డలకు తల్లి పాల అవసరం ఎక్కువ ఉంటుందని అనుకున్నాను.

ఎలక్ట్రిక్ పంప్ సహాయంతో రోజుకు 600 మిల్లీ లీటర్ల వరకూ పాలు తీసి, నీలోఫర్‌కి డొనేట్ చేశాను. ఈ నాలుగు నెలల కాలంలో ఇప్పటివరకూ 30 లీటర్ల పాలు డొనేట్ చేశాను. అదనంగా ఉత్పత్తి అయ్యే పాలను ఇలా ఎవరైనా దానం చేయొచ్చు. తమ వైద్యులను సంప్రదించి, ఈ పని చేయాలి." అని వివరించారు.

జ్వాల గుత్తా చేసిన తల్లి పాల దానానికి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రశంసలు లభిస్తున్నాయి. పాలు సరిపోని ఎంతోమంది నవజాత శిశువులకు ఉపయోగపడే విధంగా ఈ అవగాహన సమాజంలో మరింత పెరగాలి.

'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' పోటీలు

తెలంగాణలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' పేరిట పోటీలు నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం (మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటల పోటీలు ఉంటాయి. షార్ట్ ఫిలిమ్స్ నిడివి 3 నిముషాలు, పాటల వ్యవధి 5 నిమిషాలకు మించి ఉండకూడదు. పోటీల్లో ఎంపికైన థీమ్స్‌కు ప్రథమ బహు మతిగా రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1 లక్ష, కన్సొలేషన్ బహుమతి రూ. 20 వేలు (ఐదుగురికి) ఇవ్వడంతో పాటు విజేతలందరికీ ప్రశంసా పత్రం, జ్ఞాపిక ప్రదానం చేస్తారు. ఈ పోటీలో పాల్గొనే వారందరూ 40 ఏళ్ళ లోపు వయసు కలిగి ఉండాలి, 4కె రిజల్యూషన్ కలిగి ఉండాలి. షార్ట్ ఫిల్మ్, వీడియో సాంగ్స్ ఏవైనా ఈ పోటీలలో సూచించిన 'థీమ్'ల పైనే ఉండాలి, మీరు చేసిన వీడియోలు గతంలో ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదు, బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కోసమే చిత్రీకరించినవై ఉండాలి. నిర్దేశిత గడువులోగా వచ్చిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి వివిధ కేటగిరీలలో ఎంపికలు పూర్తి చేస్తుంది. ఎంట్రీలను పంపించేందుకు తుది గడువు ఈనెల 30 అని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు చెప్పారు.





'తెలుసు కదా' షూటింగ్ పూర్తి

'మిరాయ్' తర్వాత పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న సినిమా 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడు. శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా కథానాయికలు. నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుంది. లోకేషన్‌లో చిత్ర బృందం కేక్ కట్ చేసుకుని సెలబ్రేషన్ జరుపుకుంది. ఇటీవలే రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఫస్ట్ సాంగ్ 'మల్లిక గంధ' విపరీతంగా ట్రెండింగ్‌లో ఉంది.త్వరలో సెకండ్ సాంగ్ రిలీజ్ కానుందని దర్శకుడు నీరజ కోన తెలిపారు. తమన్ సంగీతాన్ని అందించారు. అక్టోబర్ 17న ఈ సినిమా విడుదల కానుంది.

'లిటిల్‌హార్ట్స్'కు మహేష్‌బాబు అభినందన



'లిటిల్ హార్ట్స్' సినిమ కొత్తగా, వినోదాత్మకంగా ఉంది. నటీనటులందరూ అద్భుతంగా నటించారు. సినిజిత్.. నువ్వు దయచేసి ఫోన్ ఆఫ్ చేసి ఎక్కడికీ వెళ్లొద్దు బ్రదర్. త్వరలోనే నువ్వు చాలా బిజీ అయిపోతావ్. ఇలాగే అదరగొడుతూ ఉండు. చిత్ర యూనిట్ మొత్తానికి శుభాకాంక్షలు' అని కథానాయకుడు మహేష్‌బాబు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ పెట్టారు. తన అభిమాన హీరో ట్వీట్ చూడగానే సినిజిత్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 'నేను ఎక్కడికీ వెళ్లను అన్నా' అని సమాధానం ఇచ్చాడు. యూట్యూబర్, మీమర్ మౌళి కథానాయకుడిగా వెండితెరపై ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. శివానీ నాగారం కథానాయిక, సాయి మార్తాండ్ దర్శకత్వం వహించగా సినిజిత్ ఎర్రమిల్లి సంగీతం అందించారు. ఈనెల ఐదోతేదీన విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమా బాగుందంటూ ఇప్పటికే గోపీచంద్, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ వంటి సినీ కథానాయకులు అభినందించారు.

28న తెలుగు సినీ, డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ ఎన్నికలు

తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న తెలుగు సినీ, డిజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ (24 క్రాఫ్టులు) ఎన్నికలు ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటింగ్ జరగనుంది. ఫిలింనగర్‌లోని ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ హాలులో సాయంత్రం 4.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. యూనియన్ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా రెండేళ్లపాటు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు భర్తీ కానున్నాయి. ఈనెల 22న నామినేషన్ల స్వీకరణ ఫెడరేషన్ కార్యాలయంలో ఉదయం10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరగనుంది. అదేరోజు స్క్రూటినీ చేసి సాయంత్రం 5 గంటలకు ఫైనల్‌లిస్టు విడుదల చేస్తారు. 24 వరకూ నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు గుర్తుల కేటాయింపు జరుగుతుంది. ఎన్నికల ప్రధాన అధికారులుగా వల్లభనేని అనిల్‌కుమార్, అమ్మిరాజు కానుమిల్లి వ్యవహరించనున్నారు. ఈమేరకు అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమిల్లి, కోశాధికారి టివి అలెగ్జాండర్ (అలెక్స్) ఒక ప్రకటన విడుదల చేశారు.



మంధాన సెంచరీ

దీప్తి ఆల్‌రౌండ్ ప్రదర్శన
రెండో వన్డేలో ఆస్ట్రేలియా మహిళలపై టీమిండియా గెలుపు

ముల్లన్‌పూర్(ఛండీగడ్): ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా 102పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సెంచరీకి తోడు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, రీచా ఘోస్ బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళలజట్టు 49.5ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. భారీ ఛేదనలో ఆస్ట్రేలియా జట్టు 40.5ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. ఎలైసా పెర్రీ(44), సథర్లాండ్(45) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. భారత బౌలర్లు క్రాంతి గాడ్‌కు మూడు, దీప్తి శర్మకు రెండు, రేణుక, స్నేహ్ రాణా, అరుంధతి, రాధా యాదవ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు ప్రతికా రావల్(25), మంధాన కలిసి తొలి వికెట్‌కు 70 పరుగులు జతచేశారు. ఆ తర్వాత హర్లిన్(10), కెప్టెన్ హర్మన్(17) నిరాశపరిచినా.. దీప్తి శర్మ(40) ఆదుకుంది. ఈ క్రమంలో మంధాన(117; 91బంతుల్లో 14ఫోర్లు, 4సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసింది. లోయర్ ఆర్డర్‌లో స్నేహ్ రాణా(24) కూడా రాణించడంతో భారతజట్టు 292పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు బ్రౌన్‌కు మూడు, గార్డినర్‌కు రెండు, స్కట్, సథర్లాండ్, మెక్‌గ్రాత్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్మృతి మంధానకు దక్కింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్‌లో గెలిచి 1–1తో సమంగా నిలువగా.. మూడో, చివరి వన్డే ఢిల్లీ వేదికగా శనివారం జరగనుంది.



స్కోర్‌బోర్డు..

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతికా రావల్ (సి)వారేహామ్ (బి)గార్డినర్ 25, మంధాన (సి)గార్డినర్ (బి)మెక్ గ్రాత్ 117, హర్లిన్ (రనౌట్)కింగ్/హీలీ 10, హర్మన్‌ప్రీత్ (సి)సథర్లాండ్ (బి)గార్డినర్ 17, దీప్తి శర్మ (సి)సథర్లాండ్ (బి)బ్రౌన్ 40, రీచా ఘోష్ (సి)జార్జియా (బి)సథర్లాండ్ 29, రాధా యాదవ్ (ఎల్‌బి)బ్రౌన్ 6, అరుంధతి రెడ్డి (బి)బ్రౌన్ 4, స్నేహ్ రాణా (సి)బ్రౌన్ (బి)స్కట్ 24, క్రాంతి గాడ్ (రనౌట్)మెక్‌గ్రాత్ / హీలీ 2, రేణుక సింగ్ (నాటౌట్) 3, అదనం 15. (49.5ఓవర్లలో ఆలౌట్) 292పరుగులు. **వికెట్ల పతనం:** 1/70, 2/119, 3/152, 4/192, 5/239, 6/247, 7/255, 8/272, 9/275, 10/292**బౌలింగ్:** స్కట్ 7.5–0–46–1, గార్డినర్ 10–1–39–2, బ్రౌన్ 8–0–42–3, పెర్రీ 2–0–15–0, సథర్లాండ్ 10–0–58–1, వారేహామ్ 4–0–41–0, మెక్‌గ్రాత్ 4–0–20–1, కింగ్ 4–0–26–0.


ఆస్ట్రేలియా మహిళల ఇన్నింగ్స్: హీలీ (సి)అరుంధతి (బి)క్రాంతి గాడ్ 9, జార్జియా (బి)రేణుక 0, ఎలైసా పెర్రీ (సి అండ్ బి)రాధా యాదవ్ 44, మూనీ (సి)అరుంధతి రెడ్డి (బి)స్నేహ్ రాణా 18, సథర్లాండ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)అరుంధతి 45, గార్డినర్ (సి)రాధా యాదవ్ (బి)దీప్తి శర్మ 17, మెక్‌గ్రాత్ (సి)అరుంధతి (బి)దీప్తి 16, వారేహామ్ (బి)క్రాంతి గాడ్ 10, కింగ్ (రనౌట్) స్నేహ్ రాణా /క్రాంతి గాడ్ 2, స్కట్ (సి అండ్ బి)క్రాంతి గాడ్ 0, బ్రౌన్ (నాటౌట్) 14, అదనం 15. (40.5ఓవర్లలో ఆలౌట్) 190 పరుగులు. **వికెట్ల పతనం:** 1/8, 2/12, 3/62, 4/108, 5/134, 6/151, 7/164, 8/169, 9/170, 10/190. **బౌలింగ్:** క్రాంతి గాడ్ 9.5–0–28–3, రేణుక 6.3–0–28–1, స్నేహ్ రాణా 6–0–35–1, అరుంధతి 7.3–0–46–1, దీప్తి 6–0–24–2, రాధా యాదవ్ 5–0–27–1.

ఫైనల్‌కు నీరజ్, సచిన్

తొలి ప్రయత్నంతోనే బెర్త్
ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



నీరజ్ చోప్రా



సచిన్ యాదవ్

టోక్యో: భారత స్టార్ జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. జపాన్‌లోని టోక్యో వేదికగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ నీరజ్ చోప్రా తన తొలి ప్రయత్నంలోనే ఈ ఘనత సాధించాడు. ఫైనల్‌కు అర్హత మార్క్ 84.50 మీటర్లను దాటాడు. నీరజ్ చోప్రా తొలి ప్రయత్నంలో బల్లెం 84.85 మీటర్ల దూరం విసిరి సునాయాసంగా ఫైనల్లోకి అడుగుపెట్టారు. నీరజ్ చోప్రా తన గ్రూపులో ఉన్న ఆరుగురు అథ్లెట్లలో మొదటి రౌండ్‌లోనే నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించిన ఏకైక ఆటగాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో నీరజ్ చోప్రా ఫైనల్ పోటీ కోసం గురువారం బరిలోకి దిగనున్నాడు. నీరజ్ చోప్రాతో పాటు పాకిస్తాన్‌కు చెందిన అర్షాద్ నదీమ్ కూడా ఫైనల్లో చేరాడు. భారత్‌కు చెందిన మరో జావెలిన్ త్రోయర్ సచిన్ యాదవ్(83.67మీ.) 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. టాప్–12లో నిలిచిన త్రోయర్ల మధ్య నేడు పతక పోటీ జరగనుంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆర్షాద్ నదీమ్, నీరజ్ చోప్రా ముఖాముఖి తలపడడం ఇదే తొలిజారి. ఆ ఒలింపిక్స్‌లో అర్షాద్ నదీమ్ 92.97 మీటర్ల త్రోతో గోల్డ్ గెలుచుకోగా.. నీరజ్ చోప్రా 89.45 మీటర్ల త్రోతో రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ప్రి క్వార్టర్స్‌కు సాత్విక్-చిరాగ్
చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

లీ–నింగ్(చైనా): చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్‌లో లక్ష్యసేన్ పరాజయాన్ని చవిచూడగా.. డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ ప్రి క్వార్టర్స్‌కు చేరారు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్–చిరాగ్ 24–22, 21–13పాయింట్ల తేడాతో హాంకాంగ్ జంటను చిత్తుచేశారు. ఈ మ్యాచ్ కేవలం 42 నిమిషాల్లోనే ముగిసింది. ఇక సింగిల్స్‌లో లక్ష్యసేన్ 11–1, 11–21తో టోమా జూనియర్ పాపోవ్ చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. ఈ మ్యాచ్ కేవలం 30 నిమిషాల్లోనే ముగిసింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ధ్రువ్ కపిల–తానీసా కాస్ట్రో జంట 19–21, 13–21తో 2వ ర్యాంక్ జంట చైనాకు చెందిన ఫెంగ్ యాన్–హుంగ్ డాంగ్ చేతిలో ఓటమిపాలయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68